రూ.25 కోట్లు గోవిందా!



వైసీపీ నేతకు ముడుపులిచ్చి నష్టపోయిన తిరుమల వ్యాపారులు

అప్పుడే తట్టలపైబడ్డ టీడీపీ నేతలు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తట్టలు, షాపుల లైసెన్సుల రెన్యువల్ కోసం అధికార పార్టీ నాయకులకు దాదాపు రూ.25కోట్లు ముడుపులుగా చెల్లించుకున్న వ్యాపారులు, ప్రభుత్వం మారిపోవడంతో లబోదిబోమంటున్నారు. టీటీడీ పాలకమండలి ఆమోదం కూడా పొందిన ఈ వ్యవహారంలో వైసీపీ ముఖ్య నాయకుడు పెట్టిన ఎన్నికల మెలికవల్ల దుకాణాల ఏర్పాటు ఆగిపోయిందని, కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందనే నమ్మకం లేదని వారు ఆందోళన చెందుతున్నారు.తామిచ్చిన డబ్బులైనా వెనక్కివ్వండంటూ వారు ఆ నాయకుడి వెంట పడుతున్నట్టు సమాచారం.

తిరుమల కొండమీద షాపులు, తట్టల ఏర్పాటుకు టీటీడీ జారీ చేసే లైసెన్సులను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాల్సి వుంటుంది. కాలపరిమితి ముగిసిన వాటిని రెన్యువల్ చేసుకోవాలంటే ఉన్నత స్థాయి రాజకీయ సిఫారసుతో పాటు భారీగా డబ్బు ఖర్చు పెట్టుకోవాల్సి వుంటుంది. ఇలాంటి గడువు ముగిసిన సుమారు 230కు పైగా తట్టలు, 17 దుకాణాల లైసెన్సులను రెన్యువల్ చేసుకునేందుకు వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు కొందరు ఈ ఏడాది ప్రారంభంలో గ్రూపుగా ఏర్పడి ప్రయత్నాలు చేశారు. వైసీపీ ముఖ్యనేతను కలసి మొరపెట్టుకున్నారు. ఉత్త చేతులతో పనులు జరగవు కాబట్టి తలా కొంచెం చొప్పున రూ. పాతిక కోట్లు వసూలు చేసి ముఖ్యనేతకు ముట్టజెప్పారని సమాచారం. అందుకు తగ్గట్టే ఈ ఏడాది ఫిబ్రవరి 26న పాలకమండలి సమావేశంలో వీటికి అనుమతులు కూడా ఇచ్చేశారని తెలిసింది. వ్యాపారులు సంబరపడి షాపులు పెట్టుకునేలోగా సహకరించిన నేతే అడ్డుపుల్ల వేశారంటున్నారు. ఎన్నికల్లో వ్యాపారులు తమ పరిధిలో అధికార పార్టీకి మెజారిటీ తెప్పించిన తర్వాతే తట్టలు, షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇప్పిస్తామని చెప్పారంటున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఊడ్చుకుపోయింది. వ్యాపారులకు అప్పగించిన బూత్‌లలోనూ జనసేనకు భారీగా ఆధిక్యత వచ్చింది. తిరుమల కొండపై జనసేన అభ్యర్థికి ఏకంగా 1200ఓట్ల మెజారిటీ వచ్చింది. దీంతో నాయకుడి తీరు తెలిసిన వ్యాపారులు ఆందోళనపడి టీటీడీ అధికారులను ఆశ్రయించారని చెబుతున్నారు.వాళ్లు చేతులెత్తేయడంతో పనీ జరగక, చేతులు మారిన డబ్బూ తిరిగి రాక వ్యాపారులు శోకాలు పెడుతున్నట్టు సమాచారం.

షాపుల తరలింపునకూ చుక్కెదురు!

ఇదే సమయంలో కొండపైన ఏడు దుకాణాలను భక్తుల రద్దీ ఎక్కువగా వుండే ప్రాంతాలకు తరలించేందుకు ఎన్నికలకు ముందు కొందరు ప్రయత్నించారు. కొంత చేతిచమురు వదుల్చుకుని మరీ ఆమోదం పొందినా వారి తరలింపులు పూర్తికాలేదు.ఈలోగా జాతకాలు తారుమారు కావడంతో వీరు కూడా ఆందోళన చెందుతున్నారు. గత గురువారం కీలక అధికారి వద్దకు వీరంతా కలిసి వెళ్ళి కలసి ప్రాధేయపడినట్టు సమాచారం.అయనా నిస్సహాయత వ్యక్తం చేయడంతో వీరు కూడా నిస్పృహతో వున్నారు.

కొండమీద దబాయింపు బదలాయింపులకు ఇప్పుడు టీడీపీకి అవకాశం వచ్చింది.దీంతో అప్పుడే కొందరు టీడీపీ నేతలు దూకుడు చూపుతున్నారు. ఎలాంటి అధికారిక అనుమతులతో నిమిత్తం లేకుండా తమకు తాముగా తిరుమలలో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అది కూడా కీలక ప్రాంతాల్లో కావడం గమనార్హం. తిరుపతి కూటమి అభ్యర్థికి తొలిలోనే మద్దతు పలికిన టీడీపీ నేత ఒకరు సోమవారం ఏకంగా శ్రీవారి ఆలయం ఎదురుగా వున్న అఖిలాండం సమీపంలోనే నాలుగు తట్టలు ఏర్పాటు చేశారు. వీటికి టీటీడీ నుంచీ ఎలాంటి అనుమతులూ లేవు. అలాగే తిరుమలలో టీడీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్న మరొకరు తానేం తక్కువ తినలేదని సోమవారమే పాత

ఇపుడు టీడీపీ నేతల దూకుడు

అన్నదాన సత్రం వద్ద నాలుగు తట్టలు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి కూడా టీటీడీ నుంచీ అనుమతులు లేవు. పాత అన్నదాన సత్రం వద్ద భక్తుల రద్దీ చాలా ఎక్కువగా వుంటుంది. భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా వుండడంతో రెండేళ్ళ కిందట అధికారులు ఆ ప్రాంతంలోని తట్టలను తొలగించారు. ఇప్పుడు మళ్లీ ఇక్కడ తట్టలు వెలిశాయి. టీడీపీ ప్రభుత్వం ఇంకా ఏర్పడక ముందే ఆ పార్టీ నేతలు ఈ రీతిలో వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. తిరుమల వ్యవహారాల్లో అత్యంత క్రమశిక్షణ పాటించే టీడీపీ అధినేత చంద్రబాబు తాజా వ్యవహారాల పట్ల ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి వుంది.

పోస్టింగ్ ప్లీజ్!

టీడీపీ నేతల వెంటబడుతున్న పోలీసు అధికారులు



తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: ప్రభుత్వాలు మారగానే పోలీసు బాసుల తీరు కూడా మారిపోతుంటుంది. కొత్త కొలువుల కోసం గెలిచిన నేతల ను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీ అయిపోతారు. కొత్త ప్రభుత్వం ఇంకా ప్రమాణస్వీకారం అయినా చేయకముందే తిరుపతి జిల్లాలో పోస్టింగుల కోసం పైరవీలు మొదలయ్యాయి. గత ఐదేళ్ళుగా వైసీపీ నాయకులతో బాగా అంటకాగిన వారు ఆందోళనలో ఉండగా, గుర్తించదగిన పోస్టులు దక్కకుండా ఉండిపోయినవారు ఊపిరి పీల్చుకుని తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో మూడేళ్ళకు పైబడి పనిచేసిన వారినీ, అవినీతి ఆరోపణలున్నవారినీ, వైసీపీకి దగ్గరున్నారనే ఆరోపణలున్నవారినీ ఎన్నికలకు ముందు వీఆర్‌కు పంపారు. మరి కొందరు వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్ళుగా పీటీసీలోనూ, వీఆర్‌లోనూ కొనసాగుతున్నారు. వీరంతా ఇప్పుడు కోరుకున్న స్థానాల్లో కొలువుదీరాలని ప్రయత్నాలు చేస్తున్నారు. విద్య, వైద్య కేంద్రంగా ఉన్న తిరుపతి, చుట్టుపక్కల స్థానాల మీదే అందరి దృష్టి ఉంది. ఒక మాజీ మంత్రినీ, ఒక సీనియర్ టీడీపీ నాయకుడినీ ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికైన ఎమ్మెల్యేలను కలసి ప్రతిపాదనలు ఇస్తున్నారు. కడప, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న ఐదారుగురు సీఐలు ఈ ప్రయత్నాల్లో చురుగ్గా ఉన్నారంటున్నారు. పనిలో పనిగా తిరుపతిలో పనిచేసి ఇటీవల ఎన్నికల కమిషన్ వేటుకు గురైన ఇద్దరు పోలీసు అధికారులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునే దిశగా ఉన్నారని సమాచారం.

తిరుపతి కుర్చీకి పోటీ ఎక్కువ

తిరుపతి నగర డీఎస్పీ స్థానం మీద చాలా మందే ఆశ పెట్టుకున్నారని చెబుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన ఇద్దరు అధికారులు గట్టి ప్రయత్నాల్లోనే ఉన్నారు. వీరు ప్రస్తుతం కృష్ణా, అనంతపురం జిల్లాల్లో పనిచేస్తున్నారు. వీరిద్దరికీ అధికార పార్టీలోని ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా వున్నట్లు సమాచారం. ఇక తిరుపతి ఈస్ట్, అలిపిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సత్యవేడు, నగరి, చంద్రగిరి స్టేషన్లకు సీఐలుగా రావడం కోసం దాదాపు డజనుమంది పోటీ పడుతున్నారు. ప్రస్తుతం గుడివాడలో డీఎస్పీగా వున్న ఒక అధికారి గతంలో చిత్తూరులో పనిచేసిన అనుభవంతో ఇక్కడికి రావాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. అలాగే పదేళ్ళ క్రితం అలిపిరి, తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేసి ప్రస్తుతం డీసీఆర్‌బీలో వున్న అధికారి ఒకరు అలిపిరికి కానీ వీలుంటే తూర్పు సీఐగా కానీ రావడానికి మంతనాలు జరుపుతున్నారని తెలిసింది. అలాగే తిరుపతి జిల్లా నుంచి 13 మంది పోలీసు అధికారులు పొరుగు జిల్లాలకు వెళ్ళడానికి ఇంకోవైపు ప్రయత్నాలు చేస్తున్నారు.

మానవత్వమే శాపమైంది!

- రోడ్డుపై విగతజీవిగా పడి ఉన్న రైతు
- సాయం చేసేందుకు వెళ్లిన దంపతులపై దూసుకెళ్లిన పోలీసు వాహనం
- ఓ పాఠశాల కరస్పాండెంట్ దుర్మరణం
- ఏర్పేడు ఎస్‌ఐ తీరుపై దుమారం



కల్వర్టును ఢీకొన్న కారు



కారు ప్రమాదంలో చనిపోయిన మంగయ్య





ఎస్‌ఐ వాహనం ఢీకొని గాయపడ్డ కిరణ్‌కుమార్ - చనిపోయిన స్వప్న(పాతచిత్రం)

శ్రీకాళహస్తి, జూన్ 10: రోడ్డు ప్రమాదం బారిన పడిన వారిని ఆదుకుందామనుకోవడమే ఆ దంపతుల పాలిట శాపమైంది.పోలీసు వాహనం ఢీకొట్టి భార్య దుర్మరణం పాలవగా భర్త చేయి విరగ్గొట్టుకుని ఆస్పత్రిలో చేరాల్సివచ్చింది.ప్రమాదానికి కారణమైన ఎస్‌ఐ వాహనం కనీస బాధ్యత మరచి అక్కడినుంచి పారిపోవడం పట్ల తీవ్ర విమర్శలు రేగాయి.శ్రీకాళహస్తి మండలం సూరావారిపల్లికి చెందిన చెంచుబాబు, అదే గ్రామం దళితవాడకు చెందిన మంగయ్య(50) సొంత పనుల నిమిత్తం ఆదివారం రాత్రి కారులో వెంకటగిరికి బయల్దేరారు.ఎంపేడు వద్ద ఏర్పేడు - వెంకటగిరి రహదారిపై కారు అదుపు తప్పి పక్కన కల్వర్టును ఢీకొనడంతో కారు నడుపుతున్న చెంచుబాబు స్వల్పంగా గాయపడ్డాడు. వెనుక సీటులో కూర్చున్న మంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి మంగయ్య మృతదేహాన్ని కారు నుంచి వెలుపలకు తీసి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. తిరుపతి నగరం భవానీనగర్‌కు చెందిన న్యాయవాది కిరణ్‌కుమార్,ఆయన సతీమణి స్వప్న(42) వెంకటగిరి వెళ్లి తిరిగివస్తూ ఈ ప్రమాదాన్ని గమనించారు.తిరుపతి నగర శివారులోని తనపల్లిలో పాఠశాలను నడుపుతున్న స్వప్న పాఠశాలకు అవసర మైన బెంచీలు వెంకటగిరిలో అమ్మకానికి ఉండటంతో కారులో అక్కడికి భర్తతో కలిసి వెళ్లారు.తిరుపతికి తిరిగి వస్తుండగా ఎంపేడు వద్ద రోడ్డుపై ఒకరు విగతజీవిగా పడి ఉండడం, చుట్టూ కొందరు జనాలు ఉండటం గుర్తించి కారు ఆపి కిందకు దిగారు.క్షతగాత్రులకు సాయం అవసరం వుందేమో అనుకుని అక్కడికి వెళ్లారు.వెంకటగిరిలో ఎస్‌ఐగా పనిచేసిన జిలానీ ఇటీవల ఏర్పేడుకు బదిలీ అయ్యారు.వెంకటగిరిలోనే ఉంటూ ఏర్పేడుకు రోజూ వచ్చిపోయే వాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఎస్‌ఐ జిలానీ బొలేరో కారులో ఏర్పేడు నుంచి వెంకటగిరికి బయల్దేరాడు.ఎంపేడు వద్ద రోడ్డు ప్రమాదాన్ని, గుమికూడిన మనుషులను గమనించకుండా బొలేరో దూసుకెళ్లిన క్రమంలో స్వప్న రోడ్డుపై కొంతదూరం ఎగిరిపడింది. అలాగే ఆ కారు ఢీకొని ఆమె భర్త కూడా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి మండలం గంగలపూడి దళితవాడకు చెందిన యువకుడు సురేష్ అటు వెళుతూ ఈ ఘటనను చూశాడు. దంపతులను ఢీకొన్న వాహనం కొంతదూరం ముందుకు వెళ్లి ఆగింది. అయితే అందులో నుంచి ఎవరూ దిగలేదు. అనంతరం స్పందించిన సురేష్ హుటాహుటిన దంపతులను వారి కారులోనే ఎక్కించుకున్నాడు. ఇది గమనించిన ఎస్‌ఐ వాహనం అక్కడి నుంచి వేగంగా ముందుకు సాగిపోయింది. సురేష్ క్షతగాత్రులైన దంపతుల కారులోనే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేందుకు బయలుదేరాడు. కొంతదూరం ముందుకు వెళ్లిన తరువాత ప్రమాదానికి కారణమైన పోలీసు వాహనం వేగంగా వెళ్లడాన్ని వీడియో తీశాడు. ఆ వాహనంలోని నెంబరు ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. అనంతరం దంపతులను వెంకటగిరి ఆస్పత్రిలో చేర్పించాడు. పరీక్షించిన వైద్యులు స్వప్న అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుడిచెయ్యి విరిగిన కిరణ్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి సురేష్ తరలించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మంగయ్య మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంపై మొదట కేసు నమోదు చేశారు. అనంతరం సోమవారం ఉదయం చికిత్స అనంతరం కిరణ్‌కుమార్ శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన ఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో స్వప్న మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. వీరికి ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు.

ఇదేం అమానుషం?

పోలీసు వాహనం కారణంగా జరిగిన ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందడం స్థానికంగా కొందరు చూశారు. ఘటన జరిగిన దగ్గర ఒక కంటైనర్ హౌస్ ఉంది. అందులో రోడ్డుపై దృశ్యాలను నిక్షిప్తం చేసేలా రెండు సీసీ కెమెరాలున్నాయి.వెంకటగిరిలో కోడిపందేలు, పలు అసాంఘిక కార్యకలాపాల్లో ఎస్‌ఐ జిలానీ తలదూర్చినట్లు చాలాకాలంగా ఆరోపణలున్నాయి. ఇలాంటి కారణాలతోనే కొద్ది నెలల క్రితం ఏర్పేడుకు ఆయన బదిలీ అయ్యారు. ఆదివారం రాత్రి రోడ్డుపై ప్రమాదాన్ని చూశాక ఆగి సాయం చేయాల్సిన బాధ్యత ఎస్‌ఐపై ఉంది. కానీ కనీసం గమనించకుండా మనుషులపై వాహనం దూసుకెళ్లింది. కొంతదూరంముందుకు వెళ్లి ఆగిన వాహనం ముందుకు వేగంగా వెళ్లిపోవడాన్ని అందరూ గమనించారు.అయితే పోలీసు శాఖలోని కొందరు అధికారులు ఈ ఘటనకు మసిపూసే ప్రయత్నం ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం వరకు రోడ్డు ప్రమాదం బయటకు పొక్కకుండా విఫల యత్నం చేశారు. ఆ తరువాత చేసేదేమీ లేక కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసు వాహనం నెంబరుతో మాత్రమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అంతటితో ఆగకుండా ఎస్‌ఐ జిలానీ వాహనం ఢీకొన్న ఘటన నిజమే నని దంపతులు రోడ్డు దాటుతుండగా జరిగిందని... ఎస్‌ఐ జిలానీయే వారిని పోలీసు వాహనంలో ఎక్కించుకుని వైద్యశాలకు తరలించి కాపాడే ప్రయత్నం చేశాడని శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేయడం విమర్శలపాలైంది.

శభాష్ సురేష్

ప్రమాదం పట్ల సురేష్ స్పందించిన తీరుపై ప్రశంసలు వెల్లువెత్తాయి. రోడ్డుపై ఘటన చూసిన వెంటనే హుటాహుటిన దంపతులను వారి కారులోనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు.పోలీసు వాహనం నెంబరును గుర్తు పెట్టుకున్నాడు. ఆ వాహనం ముందు వెళుతుండగా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతోనే ఎస్‌ఐ దురాగతం వెలుగులోకి వచ్చింది. సురేష్ అంతటితో ఆగకుండా మృతురాలి కుటుంబానికి అండగా నిలిచాడు. పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులు తీసుకునే వరకు వారి వెంటే ఉండి సాయం చేశాడు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 10 : వచ్చే ఏడాది జనవరి 26న భారత ప్రభుత్వం ప్రకటించే పద్మ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజికసేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమల రంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వ్యక్తులు అర్హులని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మాఅవార్డ్స్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని ఈనెల 22లోపు అలిపిరి వద్ద వున్న సెట్విన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 0877-2286921, 94405 73537 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సిలికా మైన్ల హార్డ్ డిస్కులు, ఫైళ్లు దహనం?



కోట మండలం కొత్తపట్నంలో తవ్వుతున్న సిలికా (ఫైల్ ఫొటో)

కోట, జూన్ 10 : కోట, చిల్లకూరు మండలాల్లోని సిలికా మైన్లకు సంబంధించిన సమాచారంతో కూడిన కీలక హార్డ్‌డిస్కులు, సీడీలు, ఫైళ్లు దగ్ధం చేసినట్లు సమాచారం.ఈ రెండు మండలాల్లోని 1150.97 హెక్టార్లల్లో 73 సిలికా మైన్ల లీజులున్నాయి.ఈ మైన్ల నుంచి సంవత్సరానికి రూ.443 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో కీలక నేతలు కొంతమంది సిలికా మైన్లను సిండికేట్‌లోకి తీసుకొని కోట్లాది రూపాయల రాయల్టీని ప్రభుత్వానికి ఎగనామం పెడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ తరువాత గనుల శాఖ, ఏపీఎండీసీ సిలికా తవ్వకాలు జరపరాదని నిషేధం విధించింది. అప్పటి వరకు చిల్లకూరు, కోట మండలాల్లో అనధికారిక సిలికా లావాదేవీలు, బిల్లులు, రవాణాలకు సంబంధించిన సమాచారాన్ని అంతా హార్డ్‌డిస్కులు, సీడీలు, ఫైళ్ల రూపంలో పొందుపరిచినట్లు సమాచారం. ఎలాగో వైసీపీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో ఆ పార్టీ కీలక నేతలు ఇద్దరు ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచారు. ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ తరువాత టీడీపీ అధికారంలోకి రావడంతో ఎక్కడ ఈ ఫైళ్ల బాగోతం బయటపడుతుందోనని కోట మండలం కొత్తపట్నం మైన్ల వద్ద ఆ సమాచారాన్ని నాలుగు రోజుల క్రితం రాత్రి వేళ తగులబెట్టినట్లు సమాచారం.ఒక పక్క బేవరేజస్‌పై తనిఖీలు జరుపుతూ శాఖల వారీగా ఫైళ్లు స్వాధీనం చేసుకుంటున్న ఆయా శాఖల ఉన్నతాధికారుల తీరుతో వైసీపీ నేతలు ఉలిక్కిపడ్డారు. దీంతో అనుమతులు ఒకచోట తీసుకుని మరోచోట సిలికా తవ్వకాలు జరపడంతో పాటు ఎగుమతులకు సంబంధించిన వే బిల్లులను దహనం చేసినట్లు తెలిసింది.ఫైళ్లను కాల్చివేసిన సమాచారం గనుల శాఖ ఉన్నతాధికారులకు కూడా అందిందని సమాచారం.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



పాకాలలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పాకాల, జూన్ 10: మండలంలో టీడీపీ శ్రేణులు సోమవారం నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నాయి. స్థానికంగా,దామల చెరువులోని పార్టీ కార్యాలయంలో వీరు కేక్ కట్‌చేశారు. హిందూపురంలో ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పులివర్తి నానీకి సన్మానం



నానీని సన్మానిస్తున్న దొడ్ల కరుణాకర రెడ్డి తదితరులు

తిరుపతిరూరల్, జూన్ 10: చంద్రగిరి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన పులివర్తి నానీని తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంటకు చెందిన టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు సోమవారం సన్మానించారు. నానీదంపతులను దుశ్శాలువా, పూలకిరీటం, గజమాలతో సన్మానించి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు, యువత పాల్గొన్నారు.

నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా



ఎంజేఆర్ కళాశాల చైర్మన్ అవినాశ్ రెడ్డి

పీలేరు, జూన్ 10: అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా సౌజన్యంతో రెండు రోజులపాటు జరగనున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని ఆయన వివరించారు. జాబ్‌మేళాలో టెక్ మహీంద్రా, ట్రెండ్ ఇన్ఫర్మేషన్స్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రోబోట్-ఈడీ, సాథర్లాండ్, టీం లీజ్, ఈటీఎస్ గ్లోబ్, క్యూస్ కార్ప్, అపోలో, ఫ్యూషన్ సి ఎక్స్ యంగ్ మైండ్స్ గ్రీన్ బ్లిస్, కాలిబర్ హెచ్‌ఆర్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో 30కిపైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలైన టీసీఎస్, అక్సెంచర్, డెల్టా ఎక్స్ ఆలోహ టెక్నాలజీస్, సూర్య టెక్ ప్రాంగణ ఎంపికలు చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగిగా అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దాడులు మా సంస్కృతి కాదు : టీడీపీ



మురళి

భాకరాపేట, జూన్ 10: ప్రశాంతంగా ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టి దాడులు చేయడం తమ పార్టీ సంస్కృతి కాదని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ అన్నారు. భాకరాపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లుగా చెవిరెడ్డికి ప్రజలు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే గిఫ్ట్ ప్యాక్‌లతో సరిపెట్టారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ వారు చేసిన అన్యాయాలు, అరాచకాలు, అక్రమాలను ప్రజలు సహించలేకపోయారన్నారు. నియోజకవర్గంలో ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉందన్నారు. తాను ఇంకా ఎమ్మెల్యేనేనన్న భ్రమ నుంచి చెవిరెడ్డి బయటకు రావాలన్నారు. నాయకులందరూ ప్రజల మన్ననలు పొందేలా సేవ చేయాలన్నారు. క్రమశిక్షణ, నీతి నిజాయితీలకు టీడీపీ మారుపేరుగా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో సీమకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఉద్యోగుల సంఘ మాజీనేత నరసింహులు నాయుడు



తిరుపతిరూరల్, జూన్ 10: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే మంత్రివర్గంలో రాయలసీమ జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘ మాజీనేత, జనసేన నాయకులు ఎం.నరసింహులునాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఎన్డీఏ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం లేని విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర క్యాబినెట్‌లో ఎక్కువమందికి అవకాశం కల్పించాలన్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రాయలసీమలోని ప్రతి జిల్లాకు ఒక కరువు మంత్రిగా పరిపాలనా సౌలభ్యం కోసం తీసుకున్నారన్నారు. ఇప్పుడు కూడా కరువు, వలసల నివారణ, పరిశ్రమల స్థాపన, సీమ అభివృద్ధికి ఈ ప్రాంత జిల్లాల నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం పెంచాలన్నారు. స్థానిక స్వామివారి సేవకులుగా గుర్తింపు పొందిన యాదవ కులస్థులకే టీటీడీ చైర్మన్ ఇస్తే సముచితంగా ఉంటుందన్నారు. వైస్‌చైర్మన్లుగా తిరుపతి, తిరుమల నుంచి ఒక్కొక్కరు చొప్పున, ఇతరవర్గాలకు చెందిన ఇద్దరికి, ఈసీ సభ్యులుగా ఎక్కువమంది స్థానికులకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సైకం జయచంద్రారెడ్డికి సన్మానం



తిరుపతిరూరల్, జూన్ 10: రాష్ట్రంలో కూటమిప్రభుత్వం ఏర్పాటు కావడాన్ని హర్షిస్తూ.. చంద్రగిరి మండలం గంగుడపల్లె గ్రామానికి చెందిన పలువురు సోమవారం రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సైకం జయ చంద్రారెడ్డిని సన్మానించారు. గ్రామ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, శ్రీధర్, వెంకటరెడ్డి, అప్పిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మండలయూత్‌నాయకులు తదితరులు దుశ్శాలువా,పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

కూటమి గెలుపుపై చికాగోలో సంబరాలు



చికాగోలో టీడీపీ నాయకుల సంబరాలు

ఎర్రావారిపాలెం, జూన్ 10: రాష్ట్రంలో కూటమి గెలుపుపై చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళాధ్యక్షురాలు లలిత ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రులు చికాగోలో ఆదివారం విజయోత్సవాలు జరుపుకొన్నారు. చంద్రగిరి ఎంఎల్‌ఏగా పులివర్తి నాని గెలుపునకు కృషి చేసిన వీరందరూ అక్కడ సమావేశమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతి,చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో తమ విలువైన స్థలాలు కబ్జా అయ్యాయని బాధిత ఎన్‌ఆర్‌ఐలు పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి ధ్యేయంగా నానీ పనిచేయాలని వారు ఆకాంక్షించారు. సమావేశంలో బద్రి, రఘు, ఉలపల్,రాజు,అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అమాత్యులయ్యేదెవరు?

- జిల్లావ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ
- నేడు స్పష్టత వచ్చే అవకాశం
- తీవ్రంగా యత్నిస్తున్న ఆశావహులు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఇక ఒక్క రోజు మాత్రమే గడువుంది. రేపు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మంత్రివర్గ సహచరులూ ప్రమాణ స్వీకారం చేసే అవకాశముంది. దీంతో జిల్లా నుంచీ అమాత్యులయ్యే అదృష్టవంతులెవరన్న దానిపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ ఏర్పడుతోంది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సమయం సమీపించేస్తున్నా మంత్రి పదవులు ఎవరికి వస్తాయన్న దానిపై ఇంతవరకూ స్పష్టత రాలేదు. ఈ కారణంగానే అటు కూటమి పార్టీలతో సహా రాజకీయ వర్గాల్లోనూ, ఇటు ప్రజానీకంలోనూ ఉత్కంఠ నెలకొంది. మంత్రి పదవుల రేసులో ఎవరు విజేతలవుతారోనని ఆసక్తిగా చూస్తున్నారు. ముహూర్తం ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆశావహులు సైతం తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.మంత్రి పదవులపై కూటమి పార్టీల అధిష్ఠానాల నుంచీ స్పష్టత రాకపోవడంతో ఊహాగానాలు, ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంత్రివర్గ కూర్పుపై చర్చిస్తున్నారని, దీంతో ఎవరికి పదవులు లభిస్తాయనే విషయమై ఎలాంటి లీకులూ రావడం లేదని సమాచారం. ప్రధానంగా టీడీపీకి సంబంధించి చంద్రబాబు, లోకేశ్ మాత్రమే చర్చించుకుని నిర్ణయాలు తీసుకుంటున్నందున ముఖ్య నేతలకు సైతం సమాచారం అందడం లేదని తెలిసింది. అందువల్లే జిల్లాలోని ఆ పార్టీ నేతల్లో టెన్షన్ పెరుగుతోంది. ప్రధానంగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రచారంలో వున్నాయి. తమ నేతకే మంత్రి పదవని ఆయా నేతల అనుచరవర్గాలు ధీమాగా వున్నాయి. సీనియారిటీ, అనుభవం, పార్టీకి సుదీర్ఘకాలంగా అందించిన సేవలను దృష్టిలో వుంచుకుని అమరనాథ రెడ్డికే అవకాశం దక్కుతుందని ఆయన అనుచర వర్గం భావిస్తోంది. అయితే జిల్లాలో వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఢీకొంటున్నది తమ నాయకుడే కాబట్టి మంత్రి పదవి గ్యారెంటీ అని నల్లారి కిషోర్ అనుచరులు గట్టి నమ్మకంతో వున్నారు. వీరిద్దరే కాకుండా మిగిలిన నియోజకవర్గాల టీడీపీ శ్రేణులు కూడా తమతమ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు వచ్చే అవకాశముందని భావిస్తున్నాయి. ఎవరికి తోచిన కారణాలను వారు ప్రస్తావిస్తున్నారు. జనసేనకు సంబంధించి జిల్లాలోని ఏకైక ఎమ్మెల్యేగా వున్న ఆరణి శ్రీనివాసులుకు మంత్రి పదవి తప్పక వస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అనూహ్య రీతిలో తిరుపతి అసెంబ్లీ టికెట్ సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన శ్రీనివాసులు మంత్రి పదవి విషయంలోనూ అదే పంథా అవలంబిస్తారని అనుచరులు బలంగా నమ్ముతున్నారు. అయితే జనసేనకు ఎన్ని మంత్రి పదవులు దక్కుతాయనే దానిపై శ్రీనివాసులుకు అవకాశం ఆధారపడి వుంటుందనే అభిప్రాయం కూడా ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ ప్రచారాలు, ధీమాలు, అంచనాలు ఎలా వున్నప్పటికీ మంత్రి పదవుల విషయంలో నేడు ఎంతో కొంతమేరకు స్పష్టత వచ్చే అవకాశముంది.

ఈ మార్గంలో ముక్కు మూసుకోవాల్సిందే

- కోళ్ల, చేపల వ్యర్థాలతో దుర్గంధం



పాకాల పెద్దవంకలో పడేసిన కోళ్ల, చేపల వ్యర్థాలు

పాకాల, జూన్ 10: పాకాల-కోత్తకోట మార్గం మణిపిరెడ్డిపల్లె రైల్వే గేటు సమీపంలోని పాకాల పెద్ద వంకలో కోళ్ల, చేపల వ్యర్థాలు వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గంలో వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, బస్సు ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. ఈ మార్గంలో ఎక్కువగా కాలేజీ బస్సులు వెళ్తుంటాయి. పరిసర గ్రామాల ప్రజలు పాకాలకు నిత్యం రాకపోకలకూ ఇదే దారి. చికెన్ దుకాణదారులు, చేపల విక్రయదారులు వ్యర్థాలను ఇక్కడికి తీసుకొచ్చి రోడ్డు కల్వర్టు పక్కన పడేస్తున్నారు. వ్యర్థాలు తినడానికి కుక్కలు వస్తుండంతో రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువైపు నడిచి వెళ్లాలంటే పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని వీరు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎం ప్రమాణ స్వీకారానికి ప్రభుత్వ కార్యాలయాల ముస్తాబు



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మారుతి

చంద్రగిరి, జూన్ 10: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా చంద్రగిరి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు చేయాలని తహసీల్దార్ మారుతి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన వీఆర్వోలతో సమావేశమయ్యారు అన్ని ప్రభుత్వ కార్యాలయ భవనాలనూ మంగళ, బుధవారాల్లో సుందరంగా అలంకరించాలన్నారు. భవనాలకు విద్యుద్దీపాలంకరణతో పాటు మామిడి తోరణాల కట్టి ముస్తాబు చేయాలన్నారు. బుధవారం ప్రమాణ స్వీకారం వేడుకను ప్రజలు, రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని టీవీల ద్వారా వీక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద కూడా టీవీ ఏర్పాటు చేయాలన్నారు. సీఎం ప్రమాణ స్వీకారానికి నాలుగు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. డీటీ అమృత, సర్వేయర్ పురుషోత్తంరెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేళకు రాని సచివాలయ సిబ్బంది

- ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు



ఎర్రావారిపాలెం, జూన్ 10 : ప్రజల ముంగిటకే పాలన అంటూ ఏర్పాటు చేసిన సచివాలయాలపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకుండా డుమ్మా కొడుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసినా వీరు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సోమవారం చెరుకువారిపల్లి సచివాలయం సమయానికి తెరవలేదు. ఇక్కడ ఆధార్ అప్‌డేట్ చేసే ఉద్యోగి తీరుపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక సాకు చెబుతూ పని తప్పించుకుంటున్నాడని కొందరు బాధితులు సోమవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

పదవ తరగతి తెలుగు పాఠ్య ప్రణాళిక, దినచర్య ఆవిష్కరణ



తిరుపతి (కల్చరల్) జూన్ 10: జిల్లా తెలుగు ఉపాధ్యాయ బృందం రూపొందించిన పదవ తరగతి నూతన తెలుగు పాఠ్య ప్రణాళికలు, దినచర్య, తెలుగు మార్గదర్శి (మెటీరియల్) లను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ సోమవారం ఉదయం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ముద్రించిన పదవ తరగతి పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. దీనికి అనుగుణంగా వెంటనే పాఠ్యప్రణాళిక రూపొందించిన ఉపాధ్యాయులను అభినందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి బాలాజి, సమగ్రశిక్ష అధికారులు సురేష్, రుక్మాంగద, తెలుగు ఉపాధ్యాయ బృందం, పుస్తకాల రూపకర్తలు డాక్టర్ నెమిలేటి కిట్టన్న, జి.గోవిందయ్య, యువశ్రీమురళి, దేవానందరెడ్డి, చిన్న యర్రయ్య, రవీంద్రుడు, ఏడుకొండలు, ఎస్టీయూ ఉపాధ్యాయవాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నారా భువనేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే నాని

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డి సోమవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 12వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్న క్రమంలో విజయవాడకు చేరుకున్న పులివర్తి నాని దంపతులు భువనేశ్వరిని కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆశీస్సులు అందుకున్నారు.

కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 10: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తిరుపతి బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో ఆయనను కలిసి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జడ్పీ మాజీ సీఈవోపై ఆగిన విచారణ

చిత్తూరు రూరల్, జూన్ 10: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి అవినీతిపై జిల్లా ఆడిట్ అధికారులు జరుపుతున్న విచారణ ఆగింది. ఈ విచారణ ప్రారంభించేందుకు జడ్పీ విశ్రాంత అధికారి, ఉద్యోగులు ఎంతో కష్టపడ్డారు. ప్రభాకర్ రెడ్డి రాజకీయ పలుకుబడితో అడుగడుగునా అడ్డుపడ్డా చివరకు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో విచారణ మొదలైంది. ఆడిట్ అధికారులు ఆధారాలు సేకరించి విచారణ ప్రారంభమవుతుందనే లోపే మళ్లీ నిలిచిపోయింది. గత ఆడిట్‌లో అధికారులు ప్రభాకర్‌రెడ్డి అవినీతి చేయలేదని యుటిలైజేషన్ సర్టిఫికెట్ (క్లీన్ చిట్) ఇవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో విచారణ సక్రమంగా జరుగుతుందో లేదోనని థర్డ్ పార్టీకి ఇవ్వాలని జడ్పీ విశ్రాంత అధికారి, ఉద్యోగులు పీఆర్ కమిషనర్‌ను కోరినట్లు సమాచారం.దీంతో విచారణ చేయాలా..! వద్దా? అని ఆడిట్ అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై స్పష్టత రాకపోవడంతో విచారణ వాయిదా పడింది.జడ్పీలో అధికారులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి నలుగురి మరణానికి కారణమైన ప్రభాకర్‌రెడ్డిని వదిలిపెట్టేది లేదని అటు ఉద్యోగులు...ఇటు టీడీపీ నాయకులు చెబుతున్నారు. 30వ తేదీ రిటైరయ్యే లోపు సస్పెండ్ చేయిస్తామంటున్నారు.

అహంకారం తలకెక్కితే ఇంతే!

మీరు కుప్పం వదిలి పారిపోతే మేమేం కావాలి? ● నేతలపై వైసీపీ కార్యకర్త ఆక్రోశం



రాజేంద్ర

కుప్పం, జూన్ 10: 'పార్టీ ఓడిపోతే అండగా ఉండాల్సిన మీరే దొంగల్లాగా పారిపోయారు. అధికారముందని అహంకారం తలకెక్కితే ఇదే గతి పడుతుంది. ఇప్పుడు మేమేం కావాలి?' అంటూ వైసీపీ కార్యకర్త ఒకరు తమ నాయకులపై ఆగ్రహావేశాలతోపాటు ఆక్రోశం వెళ్లగక్కారు. సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఒక బూత్ నుంచి వైసీపీ కోసం ఎన్నికల్లో పనిచేసిన రాజేంద్ర అనే కార్యకర్త నేతల వ్యవహార శైలిపై దుమ్మెత్తిపోసిన వీడియో ఇప్పుడు కుప్పంలో హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ కార్యకర్తల ఆక్రోశాన్ని ప్రతిబింబించే ఆ వీడియోలో మాటలు ఇవీ..

'ఎందుకు ఓడిపోయాం మనం? భరత్, సెంథిల్ వీరే తోపులు. వీళ్లే తురుపులు. కార్యకర్తల్ని పట్టించుకోలేదు. పదీపన్నెండేళ్లు మీ పక్కనే ఉన్నాం. లాస్ట్‌కు జగనన్నను దగ్గరుండి నాసినం చేస్తిరి. ఇంటికొస్తే కనీసం మనిషిని మాట్లాడించే దిక్కు కూడా లేదు. నేను కుప్పంలో ఒక పంచాయతీకి పనిచేశాను. నువ్వు ఎంత బాడ్‌కోవ్ పనులు చేసుంటే కుప్పం వదిలి వెళ్లిపోతావ్? నిన్ను నమ్ముకున్న కార్యకర్తలు ఏం కావాలిప్పుడు? మేం చచ్చిపోతుండాం ఈడ. నీకు మైనస్ ఉంది. మాకు ప్లస్ ఉంది. నీతి నిజాయితీగా మంచిగున్నాం. ఎవరి సొమ్ము తిన్లా. టీడీపీ కార్యకర్తలైనా, వైసీపీ కార్యకర్తలైనా కలసిమెలసి కనీసం మంచిగుంటిమి మేము. నువ్వు, నీ కూడా ఉండేవాళ్లు అనవసరంగా గొడవలు పెట్టి, అనవసరంగా పంచాయతీలు చేసి ఈ గతికి తెస్తిరి. నిజమైన కార్యకర్తల్ని నువ్వు నమ్మలేదు. ఏళ్లతరబడి నీతోపాటు ఉంటే కార్యకర్తలకు ఏమి చేస్తివి? అధికారముందని అహంకారం పడితే ఇలానే ఉంటుంది. మనిషికి విలువనిచ్చేది నేర్చుకో. అధికారంలో ఉన్నన్నాళ్లూ నీకెంతొచ్చింది, నాకెంతొచ్చింది ఇవీ పంచాయతీలు. అయిదు ఓట్లు వేయించే బగిసిలేని లెనిన్ షర్ట్ వేసుకునేవాడు కలెక్షన్ కింగ్ నీకు. ఏదన్నా ప్రాబ్లమ్ అని మాలాంటి నిజాయితీ కలిగిన కార్యకర్తలు వొస్తే సెటిల్‌మెంట్ చేసుకో అంటావు. ఇన్నాళ్లూ గమ్మునుండి ఓడిపోయాక మాట్లాడతా వుండాను అంటావేమో. ఇన్నాళ్లూ నువ్వు చేసిన పొరపాటు చెబితే కూడా వినే పొజిషన్‌లో లేవు. నీకు అహంకారం మెడకెక్కేసింది. నేను ఏ తప్పూ చేయలా. నన్నేమన్నా మాట్లాడినారా టీడీపీవోళ్లు? న్యాయమంటే అట్లుండాల. అదీ లెక్కాచారం. అనవసరంగా కుప్పమొక్కటే కాదు, స్టేట్‌నే నాశనం చేసినారు. సంపాదించుకుని పారిపోయినారు. మేం మాత్రం ఈడ కూచ్చుని అవమానం పాలవతా వుండాము. మేమేడకి పోవాల. డబ్బు లేదు. పార్టీ ఓడిపోతే అండగా ఉండాల్సిన మీరే దొంగల్లాగా పారిపోతే మేమేం చెయ్యాల? నేను జగనన్న పార్టీనే, తెలుసు అందరికీ. నన్నెవరూ మాట్లాడలేదే. నిజాయితీగా ఉండాను కాబట్టే, ధైర్యంగా ఉండా. లీడర్లే పరిగెత్తి పూడిస్తే, కార్యకర్తలు నాశనం కావాలా? ఇకనైనా మనుషుల్లా బతకండి ఫస్ట్.'

టీడీపీకి ఓటు వేశాడని దాడి

భాకరాపేట, జూన్ 10: సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశామని తమపై వైసీపీ నాయకులు దాడి చేశారని కొందరు యువకులు వాపోయారు. ఆదివారం రాత్రి భార్యకు అస్వస్థత కారణంగా మందుల కోసం వెళ్తుండగా స్టేట్ బ్యాంక్ సమీపంలో వైసీపీ నాయకులు తనపై దాడి చేసి, పిడిగుద్దులు గుద్దారని భాకరాపేట బీసీ కాలనీకి చెందిన తేజ ఆవేదన వ్యక్తం చేశాడు. భయభ్రాంతులకు గురై పారిపోయినట్లు పేర్కొన్నాడు. ప్రభుత్వం మారినా దాడి చేయడం దుర్మార్గమన్నాడు.అయితే ఈ విషయమై పోలీసులు తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

రెండు కుటుంబాల వివాదం

మంగళంలో ఉద్రిక్తత.....బందోబస్తు ఏర్పాటు



దాడిలో దెబ్బతిన్న కారు

మంగళం, జూన్ 10:వరుసకు అన్నదమ్ముల మధ్య పాత కలహాలు మళ్లీ చెలరేగడంతో సోమవారం మంగళంలో ఉద్రిక్తత ఏర్పడింది. సప్తగిరికాలనీ పంచాయతీ ఉప సర్పంచ్ వసంతు అశోక్‌రెడ్డి, ఆయన చిన్నాన్న లక్కిరెడ్డి మధ్య విభేదాలున్నాయి.అశోక్‌రెడ్డి వైసీపీకి చెందిన వారు కాగా లక్కిరెడ్డి కుటుంబం ఇటీవల టీడీపీలో చేరింది.ఈ నేపథ్యంలో లక్కిరెడ్డి కుమారుడు పురుషోత్తంరెడ్డి, బంధువు సుదర్శన్‌రెడ్డి సోమవారం అశోక్‌రెడ్డిని గతంలో జరిగిన లావాదేవీల విషయమై అడిగారు. దీంతో గొడవ ప్రారంభమైంది. ఈ వివాదంలో తమ కారు అద్దాలు పగులగొట్టారని, కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారని అశోక్‌రెడ్డి తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్కిరెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తున్నామని సీఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. దాడి విషయం తెలుసుకుని వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డికి పోలీసులు సర్ది చెప్పి పంపేశారు. దాడులు పునరావృతం కాకుండా పోలీసులు మంగళంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



చంద్రగిరి, జూన్ 10: చంద్రగిరి జాతీయ రహదారిలోని ఫ్లై ఓవర్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సుమారు 60 ఏళ్ల వ్యక్తి సోమవారం మధ్యాహ్నం జాతీయ రహదారిలో నడుచుకుంటూ వెళ్తుండగా చంద్రగిరి జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గుర్తించి, ప్రథమ చికిత్స చేశారు. 108 అంబులెన్స్‌కు, జాతీయ రహదారి అంబులెన్స్‌లకు సమాచారం అందించారు. అ రెండు అంబులెన్స్‌లు గంటకు పైగా రాకపోవడంతో వృద్ధుడిని అక్కడే ఉంచారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోనేలోగా అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటా: చెవిరెడ్డి

పాకాల జూన్ 10: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. భైనపల్లెలో సోమవారం మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ తరువాత టీడీపీ శ్రేణులు, వైసీపీ శ్రేణులపై భౌతిక దాడులు చేస్తున్నాయన్నారు. ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలను కొట్టడానికి వ్యూహరచనలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు మంచి చేయడానికి ప్రణాళికలు వేసుకోవాలే గాని ప్రత్యర్థి పార్టీ నాయకులపై దాడులు చేయడం సరికాదన్నారు.

గుడిసెను దహనం చేసిన దుండగులు

చంద్రగిరి, జూన్ 10: రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ గుడిసెకు నిప్పు పెట్టారు. స్థానికుల వివరాల మేరకు కాలనీకి చెందిన సురేష్‌కు, బంధువులకు మధ్య ఇంటి స్థలంపై కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నా యి. ఇటీవల సురేష్ ఇంటి నిర్మాణం చేపట్టాడు. తన ఇంటి వస్తు సామగ్రిని పక్కనే ఉన్న గుడిసెలో ఉంచాడు. వారం రోజుల క్రితం మదనపల్లె వెళ్లాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పంటించారు. గుడెసె పూర్తిగా కాలిపోయింది. టీవీ, ఫ్రిడ్జ్, బట్టలు, ఇతర సామగ్రి దహనమయ్యాయి. కాలనీ వాసుల సమాచారంతో అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. తన బంధువులపై బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైతు భరోసా పెంపుపై బీజేపీ నాయకుల హర్షం

చంద్రగిరి, జూన్ 10: ప్రధాన మంత్రిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన మోదీ సోమవారం రైతు భరోసా పథకంపై మొదటి సంతకం పెట్టడాన్ని చంద్రగిరిలో బీజేపీ నాయకులు స్వాగతించారు. ఈసందర్భంగా చంద్రగిరిలో వారు స్వీట్లు పంచిపెట్టారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం యాదవ్ మాట్లాడుతూ మోదీ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రమాణస్వీకారం చేసిన మర్నాడే రైతు భరోసా సాయాన్ని రూ.6వేల నుంచి రూ.8 వేలకు పెంచాలనే ఫైలుపై సంతకం చేయడం హర్షణీయమన్నారు. ఆర్సీపురం మండల బీజేపీ అధ్యక్షుడు రామాపురం శంకర్‌రెడ్డి, మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మునిగంగిరెడ్డి, మాజీ వెంకటరెడ్డి, రామ్మూర్తి, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వైసీపీ వినతి పత్రం



భాకరాపేట, జూన్ 10: చంద్రగిరి నియోజకవర్గంలో శాంతి నెలకొల్పేలా పాలకులకు బుద్ధి ప్రసాదించాలని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సోమవారం భాకరాపేటలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యకర్తలతో కలసి నల్ల రిబ్బన్లు మెడలో వేసుకుని ఆయన నిరసన తెలిపారు. దాడులు, దౌర్జన్యాలు అరికట్టేలా పాలకులకు మార్గనిర్దేశం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్పంచ్ భూపాల్, నాయకులు పాల్గొన్నారు.

ఎంఎంబీజీకి మెమరీ ఓవరాల్ చాంపియన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న భాస్కరరాజు, అశ్విని తదితరులు

తిరుపతి(విద్య), జూన్ 10: చెన్నైలో రెండ్రోజుల క్రితం నిర్వహించిన తమిళనాడు ఓపెన్ మెమరీ చాంపియన్‌షిప్-2కె24 పోటీల్లో తిరుపతికి చెందిన మేక్ మై బేబీ జీనియస్(ఎంఎంబీజీ)స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి సత్తా చాటారని స్కూల్ చైర్మన్ సంగరాజు భాస్కరరాజు పేర్కొన్నారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరీల్లో తమ విద్యార్థులు అద్భుతంగా రాణించి అత్యధిక ప్రైజులతో (30మెడల్స్, 3ట్రోఫీలు)పాటు స్టేట్ మెమరీ ఓవరాల్ చాంపియన్-2024 అవార్డు, రోలింగ్‌షీల్డ్‌ను కైవసం చేసుకున్నారని తెలిపారు. కాగా ఇంటర్నేషనల్ మెమరీ స్పోర్ట్స్ ట్రైనర్ జీవీ నారాయణ నేతృత్వంలో విద్యార్థులకు మెమరీపై శిక్షణ నిర్వహించామని, అకడమిక్స్‌తోపాటు మెమరీ విభాగంలోనూ తమ విద్యార్థులు ప్రతిభని చాటి ఓవరాల్ చాంప్‌ని సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులను ఆయనతోపాటు అకడమిక్ డైరెక్టర్ ఎస్.అశ్విని, టీచర్లు అభినందించారు.

తిరుపతి

సీఎం ప్రమాణ స్వీకార ప్రత్యక్ష వీక్షణకు ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు రేపటి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ ప్రత్యక్ష వీక్షణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ కార్యాలయాల్లో, కమ్యూనిటీ హాళ్లలోనియోజకవర్గాల్లోని కమ్యూనిటీ హాళ్లలోకల్యాణ మండపాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేలా టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతిలో తుడా కార్యాలయం వెనుక వున్న కచ్చపి ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు జిల్లాలో ప్రతి నియోజకవర్గం నుంచి నాలుగు బస్సుల్లో ప్రజలను విజయవాడకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి బస్సుకూ ఒక నోడల్ అధికారి బాధ్యత తీసుకుని మంగళవారం ఉదయం ప్రజలను తీసుకుని బయల్దేరాల్సివుంటుందన్నారు. సాయంత్రం 5గంటలకు విజయవాడకు చేరుకునే ప్రజలకు రాత్రి బస ఏర్పాటు చేస్తారని తెలిపారు. బుధవారం ఉదయం సీఎం ప్రమాణస్వీకారం పూర్తయ్యాక వారిని జాగ్రత్తగా వెనక్కి తీసుకురావాల్సిఉంటుందన్నారు.బుధవారం వరకూ ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటుతో పండుగ వాతావరణం కన్పించాలని తెలిపారు.

ముస్తాబైన ప్రభుత్వ కార్యాలయాలు


విద్యుత్ వెలుగుల్లో శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం

ముఖ్యమంత్రిగా దిగ్విజయంగా నాలుగవసారి చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. కలెక్టరేట్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు విద్యుత్ కాంతులతో అలంకరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు మామిడి తోరణాలు కట్టి చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నారు. రేపు అమరావతిలో జగరనున్న చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 30 బస్సుల్లో ప్రజలు స్వచ్ఛందంగా తరలిపోతున్నారు. వారికి జిల్లా యంత్రాంగం పాసులు కూడా అందజేస్తున్నారు.

13నుంచి మహతిలో నాబార్డు మేళా

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10: నగరంలోని మహతి కళాక్షేత్రంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నాబార్డు ఆధ్వర్యంలో ఎఫ్‌పీవో మేళా - తరంగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాబార్డ్ డీడీ సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మాల్ ఫార్మర్స్ అగ్రి - బిజినెస్ కన్సార్టియం, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ భాగస్వామ్యంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గో ఆధారిత వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు, రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన ఉత్పత్తులు, చేనేతల కలంకారీ చీరలు, చెక్కతో చేసిన విగ్రహాలు, కుండలు మొదలైన ఉత్పత్తులను 50 స్టాల్స్ ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులను, కళాకారులను ప్రోత్సహించడం, వారి ఆదాయం పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. నగర ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

తిరుపతి అర్బన్, జూన్ 10: నూతనంగా కొలువుదీరుతున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగరాజు కోరారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదేశాల మేరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులకు బీసీలు పూర్తిమద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లాలో అన్ని సీట్లు కూటమికే దక్కాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం బీసీలకు ఎక్కువగా మంత్రి పదవులివ్వాలని, బీసీల సమస్యల పరిష్కార రక్షణ చట్టం అమలు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని సూచించారు. జిల్లా కార్యదర్శులు సోమశేఖర్‌ఆచారి, మధుఆచారి, తిరకాల మునిశేఖర్‌గౌడ్, వివేక్, కిరణ్, యశోద, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షా ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: ఏఐఎస్ఎఫ్


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

తిరుపతి (కలెక్టరేట్), జూన్ 10: నీట్ పరీక్షా ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67మందివిద్యార్థులకు 720కి720రావడం, అందులో ఆరుగురు హర్యానాలో ఒకే సెంటర్‌కు సంబంధించిన వారు కావడం అనేక అనుమానాలు కలిగిస్తోందన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ముందస్తుగా అడ్మిషన్లు చేస్తూ అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓంరాజ్, వినయ్, గ్రేస్, శివాని, శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20నుంచి హనుమ నాటకోత్సవాలు

తిరుపతి అర్బన్, జూన్ 10: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో ఈనెల 20నుంచి హనుమ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపకులు బి.ఎన్.రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. 20నుంచి 28వ తేదీ వరకు జాతీయస్థాయి పద్యనాటకాలు, సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సోలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి తెలుగు రాష్ట్రాల నుంచి 32 పద్య, 57 సాంఘిక నాటికల దరఖాస్తులు అందాయన్నారు. పరిశీలన అనంతరం 9 పద్య, 12 సాంఘిక నాటికల దరఖాస్తులను ఎంపిక చేశామన్నారు. ప్రతిభకనబరచిన ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, రోలింగ్ షీల్డ్స్, హనుమ అవార్డ్స్, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాధరెడ్డి, విజయ్‌కుమార్, శోభ, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పవన్‌కల్యాణ్‌కు మంగళగిరిలో శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న కిరణ్‌రాయల్


జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిసిన తిరుపతి పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలసి శ్రీవారి ప్రసాదాలను అందజేస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, టీడీపీ నేత పాటకం వెంకటేష్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది.

టీటీడీ పీఆర్వో బాధ్యతల స్వీకరణ


నీలిమ

తిరుమల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పీఆర్వో(పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్)గా నీలిమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీఆర్వోగా ఉన్న రవి చీఫ్ పీఆర్వోగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఏపీఆర్వోగా ఉన్న నీలిమ పీఆర్వోగా(ఫుల్ అడిషనల్ చార్జ్) నియమితులయ్యారు. ఈమేరకు ఆమె తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు.

పాస్‌పోర్టు కార్యాలయంలో మొరాయించిన కంప్యూటర్లు

● మూడు గంటల పాటు దరఖాస్తుదారుల పడిగాపులు


క్యూలైన్‌లో వేచి ఉన్న దరఖాస్తుదారులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: తిరుపతి పాసుపోర్టు సేవా కేంద్రంలో సోమవారం మూడు గంటల పాటు కంప్యూటర్లు మొరాయించాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి పాసుపోర్టు దరఖాస్తు కోసం వచ్చిన అభ్యర్థులు నానా ఇబ్బందులు పడ్డారు. స్లాటు బుక్ చేసుకుని దరఖాస్తు చేసుకుని చంటి బిడ్డలతో వచ్చిన కొందరు నడి రోడ్డుపై గంటల తరబడి నిలబడ లేక నానా తంటాలు పడ్డారు. వీరికి అవసరమైన సమాచారం ఇవ్వడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపించాయి. సెంట్రల్ సర్వర్ పనిచేయకపోవడంతో తిరుపతి పాసు పోర్టు కార్యాలయంలోని కంప్యూటర్లు పూర్తిగా పనిచేయలేదు. దరఖాస్తు దారులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన అధికారులు ఆగమేఘాలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి మళ్లీ సర్వర్ పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. 11.30 గంటల తర్వాత యథావిధిగా కంప్యూటర్లు పనిచేయడంతో దరఖాస్తు దారులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం వచ్చిన వారందరికీ అవసరమైన సేవలు అందించి పంపారు.

ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలి

మహిళా స్టేషన్ సిబ్బందికి ఎస్పీ ఆదేశం


మహిళా పోలీసు స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: ప్రతి ఫిర్యాదుపై మహిళా స్టేషన్ సిబ్బంది తక్షణం స్పందించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. తిరుపతిలోని మహిళా పోలీసు స్టేషన్ సిబ్బందితో సోమవారం పోలీసు గెస్ట్‌హౌస్ హాలులో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించినప్పుడే బాధితులకు న్యాయం చేయగలుగుతామన్నారు. మహిళల రక్షణ కోసం నగరంలో అమలు చేస్తున్న మహిళా రక్షక్, పెట్రోలింగ్, వివరాలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, తదితర సమస్యలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే నేరుగా తనకు కానీ, అదనపు ఎస్పీలకు కానీ, క్రైం అదనపు ఎస్పీకి కానీ తెలియజేయాలన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమలకుమారి, డీఎస్పీలు వెంకటాద్రి, రమణకుమార్, సీఐ శరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

పోలీసులకు కార్యాచరణ దిశా నిర్దేశం - యాత్రికులు, నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు


తిరుపతిలో ట్రాఫిక్ తీరును పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: గత కొన్నేళ్లుగా దారి తప్పిన ట్రాఫిక్‌ను దారిలో పెట్టడానికి ఎస్పీ హర్షవర్ధనరాజు నడుం బిగించారు. నిన్న మొన్నటి వరకు ఎన్నికల షెడ్యూలుతో బిజీగా ఉన్న ఎస్పీ సోమవారం ఉన్న పళంగా తిరుపతి ట్రాఫిక్‌పై దృష్టి సారించారు. నగరంలో ఆకస్మిక తనిఖీలు చేసి, ప్రధాన కూడళ్లను సందర్శించారు. విధుల్లో లేని కొన్ని పాయింట్లలో పోలీసులకు సూచనలిచ్చారు. లీలామహల్ సర్కిల్, పూర్ణకుంభం సర్కిల్, గరుడ సర్కిల్, ప్రైవేటు బస్సు స్టాండు ప్రాంతాలను పరిశీలించి, అక్కడ ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

రామోజీకి అకాడమీ ఆఫ్ ఫైనార్ట్స్ నివాళి



తిరుపతి (కల్చరల్), జూన్ 10: తెలుగుభాషకు, తెలుగు వారికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో పద్మవిభూషణ్ దివంగత రామోజీరావు ఎంతో కృషిచేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ప్రకాశం రోడ్డులోని అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యాలయంలో రామోజీరావు సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం అకాడమి వ్యవస్థాపకుడు ఆచార్య సూర్యారావు, కార్యదర్శి సురేంద్ర నాయుడు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షకులుగా, తెలుగు సంస్కృతి పోషకులుగా రామోజీరావు తెలుగు సమాజంపై చెరగని ముద్రవేశారని తెలిపారు. ఆచార్య దేవసేన నాయుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏపీ నాయుడు, ఆచార్య రాజేశ్వరి, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ కడియాల వెంకట రమణ, డాక్టర్ విభీషణ శర్మ, మహదేవ నాయుడు, డాక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(విద్య): ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు నివాళులు అర్పించారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక న్యూఇందిరానగర్‌లోని ఆపస్ కార్యాలయంలో సోమవారం రామోజీ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పుష్పాంజలి ఘటించారు. ప్రజలకు, పత్రికారంగానికి రామోజీ చేసిన సేవలను మననం చేసుకున్నారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ, సంఘం సత్యవేడు నియోజకవర్గం ఇంచార్జి దాము, సీనియర్ నాయకులు శరత్, మహేష్, వర్మ తదితరులు పాల్గొన్నారు.


రామోజీరావు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆపస్ నాయకులు

ప్రముఖ పండితుడు బాలసుబ్రహ్మణ్య శాస్త్రి మృతి



తిరుపతి (కల్చరల్) జూన్ 10: ప్రముఖ పురాణ పండితుడు, జ్యోతిష్య శాస్త్ర విద్వాంసుడు, ప్రవచన కర్త గోపావఝ్ఝల బాలసుబ్రహ్మణ్య శాస్త్రి(77) తన స్వగృహంలో ఆదివారం రాత్రి పరమపదించారు. ఈయన గత 40 సంవత్సరాలుగా టీటీడీ పౌరాణికులుగా విధులు నిర్వహించి, విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రముఖ పండితుడిగా ఆయన ఎందరికో మార్గదర్శి. నాదముని వీధిలోని ఆయన నివాసం నిత్యం జ్యోతిష పరిష్కారాల కోసం, వివాహాది శుభకార్యాల లగ్ననిర్ణయం కోసం వచ్చే వారితో నిండి ఉండేది. ఈయన దహన క్రియలు సోమవారం మధ్యాహ్నం దేవేంద్ర థియేటర్ సమీపంలోని హరిశ్చంద్ర దహన వాటికలో ముగిశాయి. నగరానికి చెందిన పలువురు సాహితీ వేత్తలు, పండితులు బాలసుబ్రహ్మణ్య శాస్త్రికి నివాళి అర్పించారు. తమ సంతాపం ప్రకటించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


అనగాని సత్యప్రసాద్, నాగవంశీ

తిరుమల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, సినీ నిర్మాత నాగవంశీ, తెలంగాణ ఎమ్మెల్సీ సుంకరి రాజు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

క్యాన్సర్ నిర్మూలనకు కృషి చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), జూన్ 10: క్యాన్సర్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నారు. రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో జిల్లాలోని ప్రాంతీయ, ఏరియా ఆస్పత్రుల వైద్యులకు సోమవారం టాటా క్యాన్సర్ వారి సహకారంతో మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతీ వైద్యుడు ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచడంతోపాటు వ్యాధిని ముందుగా గుర్తించి బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, డీపీఎంవో శ్రీనివాసులు, ఆర్బీఎస్‌కే అధికారి పద్మావతి, వైద్యాధికారులు నెహ్రూరెడ్డి, వెంకటలక్ష్మీ, రోజారమణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు పదవులివ్వాలి

తిరుపతి అర్బన్, జూన్ 10: కొత్తగా కొలువుదీరుతున్న కూటమి ప్రభుత్వంలో నాయీబ్రాహ్మణులకు పదవులివ్వాలని టీటీడీ ఉమెన్స్ బార్బర్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కె.రాధాదేవి కోరారు. సోమవారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ గత కొంతకాలంగా తిరుమల కల్యాణకట్టలో పనిచేస్తున్న క్షురకులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్‌లో తొలగించిన 9మంది క్షురకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా తమ కులానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ - అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న అభిమానులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: తిరుపతిలో సోమవారం హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ 64వ పుట్టిన రోజు సందర్భంగా తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలకృష్ణ అభిమానుల సంఘ అధ్యక్షుడు మనోహరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు జి.నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, బాలకృష్ణ అభిమాన సంఘ నేతలు కేపీ చౌదరి, మదన్మోహన్, లోకేష్ చౌదరి, షఫీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి కొబ్బరికాయలు సమర్పించిన అభిమానులు

తిరుమల, జూన్ 10(ఆంధ్రజ్యోతి):బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు సోమవారం శ్రీవారికి కొబ్బరికాయలు సమర్పించారు. టీడీపీ రాష్ట్రమీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో అభిమానులు ఏటా బాలకృష్ణ జన్మదినం సందర్భంగా తిరుమలలో కొబ్బరికాయలు కొడుతున్నారు. సోమవారం ఉదయం బాలయ్య పేరున బేడి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చన చేయించారు. అఖిలాండం వద్ద 664 కొబ్బరికాయలు సమర్పించారు. రమేష్, బంగి బాలాజీ, రూపేష్, సుబ్బు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం



తిరుపతి (కలెక్టరేట్), జూన్ 10: ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్, గౌరవాధ్యక్షుడు ఎస్.వెంకటముని, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.నరేంద్ర, అదనపు కార్యదర్శి కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నెప్ప, రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్ర, మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున, కార్యదర్శులు రామానుజులు, సుదర్శన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

14న గోవిందరాజస్వామి ఆలయంలో పుష్పయాగం

తిరుపతి (కల్చరల్), జూన్ 10: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జూన్ 14వ తేదీ శుక్రవారం పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తారు. 14వ తేదీ ఉదయం 9.30 నుంచి 11 గంటలవరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా జరుగుతుంది.

పార్టీలకతీతంగా మైనారిటీలను కలుపుకుపోతాం

తిరుపతి అర్బన్, జూన్ 10: కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ముస్లిం మైనారిటీలను కలుపుకుపోతామని, అందుకు పాలకపక్షమైనా, ప్రతిపక్షమైనా ముందుకురావాలని టీడీపీ మైనారిటీ వింగ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి మహబూబ్ బాషా తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ తిరుపతి చరిత్రలోనే తొలిసారిగా ముస్లిం మహిళలు బురఖాలు ధరించి ఉదయాన్నే ఓట్లు వేసేందుకు క్యూలో నిలబడ్డారన్నారు. ప్రభుత్వం మారాలని కసిగా కూటమికే ఓటు వేశారన్నారు. ముస్లింల అభివృద్ధికే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈనెల 17న ఈద్‌ముబారక్ వేడుకలకు పార్టీలకతీతంగా ముస్లిం సోదరులు హాజరుకావాలని కోరారు. మహమ్మద్‌రఫీ, నూరుల్లా, జమాల్, అబ్దుల్, నజరుద్దీన్, ఖాదర్‌బాషా, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పథకం ప్రకారమే నా భర్తను హత్య చేశారు
విజయకుమార్ భార్య ఆరోపణ



పోలీస్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఫుటేజీని తన మొబైల్‌లో చూపిస్తున్న మునెమ్మ

వెంకటగిరి, జూన్ 10: తన భర్త విజయకుమార్ జనసేనలో చురుకుగా ఉంటున్నారని కక్ష గట్టి వైసీపీ నాయకులు పథకం ప్రకారం హత్య చేయించారని మృతుడి భార్య మునెమ్మ ఆరోపించారు. సోమవారం పోలీస్ స్టేషన్ వద్ద మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మునెమ్మ మాట్లాడుతూ... తన భర్తను బార్ నుంచి బయటకు లాక్కొచ్చి కత్తితో పలుమార్లు పొడిచి చంపారన్నారు. సీసీ కెమెరా ఫుటేజీని ఆమె తన మొబైల్‌లో చూపారు. హత్య వెనుక అసలు దోషులను పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జనసేనలో కీలంగా ఉన్న తన కుమారుడిని అడ్డుతొలగించాలని భావించే హత్యకు కుట్రపన్నారని మృతుడి తండ్రి నరసింహులు చెప్పారు. ముమ్మాటికి ఇది రాజకీయ హత్య అని అన్నారు. అసలు దోషులను అరెస్టు చేసేవరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. తన కుమారుడి హత్య వెనుక బార్ పక్కన మంచింగ్ దుకాణం నడుపుతున్న వ్యక్తి హస్తం ఉందన్నారు. మధురెడ్డిని కూడా పోలీసులు అరెస్టు చేసి విచారిస్తే అసలు దోషులు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. కాగా విజయ్‌కుమార్‌ని హత్యచేసిన నిందితుడుని పోలీసులు అరెస్టు చేశారని తెలుసుకున్న హతుడి బంధువులు అతన్ని తమకు చూపించాలని పట్టుబట్టారు. సీఐ సంఘమేశ్వర రావు ఆందోళనకారులకు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపేశారు.

మాంబట్టు సెజ్ డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం



భారీగా ఎగిసిపడుతున్న అగ్నికీలలు

తడ, జూన్ 10: మండల పరిధిలోని మాంబట్టు సెజ్‌లో ఓ డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మాంబట్టు సెజ్‌లోని లైచికాస్ట్ పరిశ్రమకు సమీపంలో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన డంపింగ్‌యార్డు ఉంది. అక్కడ అన్ని రకాలైన పనికిరాని వస్తువులన్నీ డంప్ చేసి ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆ డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో పక్కనే ఉన్న లైచికాస్ట్ పరిశ్రమ ఆ మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూనే స్థానిక పోలీసులకు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపుచేసేందుకు త్రీవంగా శ్రమిస్తున్నారు. అగ్నిమాపక దళానికి చెందిన రెండు ఫైరింజన్లు, అపాచీ పరిశ్రమకు చెందిన మరో ఫైర్ ఇంజన్ మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నా పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్నాయి. దీనికితోడు ఈదురుగాలులు సైతం తోడయ్యాయి. రాత్రి 7.30 గంటలు గడుస్తున్నా మంటలు అదుపులోకి రాకపోవడంతో పక్కనే ఉన్న లైచీకాస్ట్ పరిశ్రమకు ప్రమాదం పొంచి ఉండటంతో ఆందోళన నెలకొంది.

విద్యుదాఘాతానికి గురై ఒకరి మృతి



ఆనందయ్య మృతదేహం

పెళ్లకూరు, జూన్ 10: ప్రమాదవశాత్తు విద్యుదా ఘాతానికి గురై ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పాలచ్చూరులో జరిగింది. దిరసనమాలకి చెందిన ఏ.ఆనందయ్య (55) స్థానిక విద్యుత్ లైన్‌మెన్‌కు సహాయంగా ఉంటూ గ్రామంలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పాలచ్చూరు అరుంధతీ కాలనీలో విద్యుత్ వైర్లుకు అడ్డంగా ఉన్న చెట్లను ఎల్‌సీ తీసుకుని తొలిగించారు. అనంతరం తెగిన విద్యుత్ వైర్లును సరిచేసే క్రమంలో పక్కనే కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫాం నుంచి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ట్రాన్స్‌కో శాఖ ఏఈ అంజాద్ బాషా తెలిపారు. మృతుడికి భార్య రత్నమ్మ, కుమారుడు శ్రీచక్రకుమార్ ఉన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

పెళ్లకూరు, జూన్ 10 : మండలంలోని చింతపూడిలో ఆదివారం రాత్రి ఓ మహిళ మెడలో నాలుగు సవర్ల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుని వెళ్లాడు. గ్రామానికి చెందిన టి.గంగమ్మకు చాలాకాలం క్రితం పక్షవాతంతో మంచానికే పరిమితమైంది. రాత్రి సమయంతో గంగమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని కేసును నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, జూన్ 10: పట్టణంలోని దర్గారోడ్డులో ఉన్న ఓ నివాసంలో అనుమానస్పద స్థితిలో వెంకటరమణయ్య (55) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకువెంకటరమణయ్య కుటుంబసభ్యులతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన వెంకటరమణయ్యను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మృతిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

బైక్‌తో ఉడాయించిన దొంగల అరెస్టు

తడ, జూన్ 10: దారికాచి బెదిరించి బైక్‌తో ఉడాయించిన ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి వరదయపాళ్యం మండలం పులియారం గ్రామానికి చెందిన పరంధాం, రవి అపాచీ పరిశ్రమలో విధులకు బైక్‌పై వెళ్తుండగా దారికాచి వారిని బెదిరించి వాహనంతో ముగ్గురు ఉడాయించిన సంగతి తెలిసిందే. ఆ కేసుకు సంబంధించి వెండ్లూరుపాడుకి చెందిన తేజ, సూళ్లూరుపేటకు చెందిన వరుణ్‌రాకేష్, దినేష్‌ను నిందితులుగా గుర్తించిన పోలీసులు సోమవారం ఉదయం కాదలూరు రోడ్డు వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ నరసింహరావు తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, జూన్ 10: సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 11న మంగళవారం గాండ్లవీధిలోని స్త్రీ స్వశక్తి భవనంలో జరుగుతుందని కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులందరూ పాల్గొనాలని పేర్కొన్నారు.

మలేరియా మహమ్మారిని తరిమికొడదాం

కోట, జూన్ 10: మలేరియా మహమ్మారిని అవగాహనతో తరిమికొడతామని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. మండలంలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు జరిగాయి. చిట్టేడు గ్రామంతోపాటు కోట బస్టాండ్ సెంటర్‌లో అవగాహన ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మలేరియా దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెలాథిన్ పౌడర్‌ను స్ప్రేచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామరాజు, సిబ్బంది పెంచలయ్య, లక్ష్మీపతి, రమేష్‌బాబు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అమాత్యులయ్యేదెవరు?

జిల్లావ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ

నేడు స్పష్టత వచ్చే అవకాశం

తీవ్రంగా యత్నిస్తున్న ఆశావహులు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఇక ఒక్క రోజు మాత్రమే గడువుంది. రేపు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మంత్రివర్గ సహచరులూ ప్రమాణ స్వీకారం చేసే అవకాశముంది. దీంతో జిల్లా నుంచీ అమాత్యులయ్యే అదృష్టవంతులెవరన్న దానిపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ ఏర్పడుతోంది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సమయం సమీపించేస్తున్నా మంత్రి పదవులు ఎవరికి వస్తాయన్న దానిపై ఇంతవరకూ స్పష్టత రాలేదు. ఈ కారణంగానే అటు కూటమి పార్టీలతో సహా రాజకీయ వర్గాల్లోనూ, ఇటు ప్రజానీకంలోనూ ఉత్కంఠ నెలకొంది. మంత్రి పదవుల రేసులో ఎవరు విజేతలవుతారోనని ఆసక్తిగా చూస్తున్నారు. ముహూర్తం ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆశావహులు సైతం తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.మంత్రి పదవులపై కూటమి పార్టీల అధిష్ఠానాల నుంచీ స్పష్టత రాకపోవడంతో ఊహాగానాలు, ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంత్రివర్గ కూర్పుపై చర్చిస్తున్నారని, దీంతో ఎవరికి పదవులు లభిస్తాయనే విషయమై ఎలాంటి లీకులూ రావడం లేదని సమాచారం. ప్రధానంగా టీడీపీకి సంబంధించి చంద్రబాబు, లోకేశ్ మాత్రమే చర్చించుకుని నిర్ణయాలు తీసుకుంటున్నందున ముఖ్య నేతలకు సైతం సమాచారం అందడం లేదని తెలిసింది. అందువల్లే జిల్లాలోని ఆ పార్టీ నేతల్లో టెన్షన్ పెరుగుతోంది. ప్రధానంగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాధరెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రచారంలో వున్నాయి. తమ నేతకే మంత్రి పదవని ఆయా నేతల అనుచరవర్గాలు ధీమాగా వున్నాయి. సీనియారిటీ, అనుభవం, పార్టీకి సుదీర్ఘకాలంగా అందించిన సేవలను దృష్టిలో వుంచుకుని అమరనాధరెడ్డికే అవకాశం దక్కుతుందని ఆయన అనుచర వర్గం భావిస్తోంది. అయితే జిల్లాలో వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఢీకొంటున్నది తమ నాయకుడే కాబట్టి మంత్రి పదవి గ్యారెంటీ అని నల్లారి కిషోర్ అనుచరులు గట్టి నమ్మకంతో వున్నారు. వీరిద్దరే కాకుండా మిగిలిన నియోజకవర్గాల టీడీపీ శ్రేణులు కూడా తమతమ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు వచ్చే అవకాశముందని భావిస్తున్నాయి. ఎవరికి తోచిన కారణాలను వారు ప్రస్తావిస్తున్నారు. జనసేనకు సంబంధించి జిల్లాలోని ఏకైక ఎమ్మెల్యేగా వున్న ఆరణి శ్రీనివాసులుకు మంత్రి పదవి తప్పక వస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అనూహ్య రీతిలో తిరుపతి అసెంబ్లీ టికెట్ సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిన శ్రీనివాసులు మంత్రి పదవి విషయంలోనూ అదే పంథా అవలంబిస్తారని అనుచరులు బలంగా నమ్ముతున్నారు. అయితే జనసేనకు ఎన్ని మంత్రి పదవులు దక్కుతాయనే దానిపై శ్రీనివాసులుకు అవకాశం ఆధారపడి వుంటుందనే అభిప్రాయం కూడా ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ ప్రచారాలు, ధీమాలు, అంచనాలు ఎలా వున్నప్పటికీ మంత్రి పదవుల విషయంలో నేడు ఎంతో కొంతమేరకు స్పష్టత వచ్చే అవకాశముంది.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే విజయశ్రీ



భారీ కేక్‌ను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులు

నాయుడుపేట, జూన్ 10: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని అగ్రహారపేటలో సోమవారం టీడీపీ నాయకుడు బాబు ఆధ్వర్యంలో మాతమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం నుంచి టీడీపీ నాయకులు మాతమ్మ ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, ఏ.రమేష్, నాయకులు షేక్‌రఫి, నెలవల రాజేష్, శ్రీనివాసులునాయుడు, విజయకుమార్‌నాయుడు, ఎం.రాజశేఖర్, మధునాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ధాన్యం వ్యాపారులు దాసరి ప్రభాకర్‌నాయుడు, పూనాటి తిరుమలనాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు భారీ కేక్ కట్ చేసి టీడీపీ నా యకులకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి. కృష్ణమనాయుడు, డి.రమేష్‌నాయుడు, కె. హరినాయుడు, కె.కిరణ్‌నాయుడు, ఎం.వెంకటరత్నంనాయుడు, ఎం.ప్రసాద్‌నాయుడు, కె.ప్రదీప్‌నాయుడు, డి.బాలచంద్రరాజు, కె.రషీద్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: కార్యకర్తలు పడిన కష్టం ఫలితమే తన కుమార్తె విజయశ్రీ విజయమని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. కొత్తూరు టీడీపీ కార్యాలయంలో పెళ్లకూరు మండలంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చిన అధ్యక్షుడు సంచి కృష్ణయ్యను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... పార్టీ నాయకులను కృష్ణయ్య సంఘటితం చేయడంతోనే మెజార్టీ వచ్చిందన్నారు. రానున్న ఐదేళ్లలో కక్షసాధింపులు ఉండవని నెలవల చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు డి.ప్రసాద్‌నాయుడు, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తగ్గ తనయుడు బాలకృష్ణ





గూడూరులో జరిగిన సంబరాలు - నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

గూడూరు, జూన్ 10: సినీ, రాజకీయ రంగాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ రాణిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం గూడూరు టీడీపీ కార్యాలయంలో బాలకృష్ణ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో బాలకృష్ణ ప్రచారం నిర్వహించి టీడీపీ విజయానికి కృషి చేశారన్నారు. హిందూపురం నుంచి మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. అనంతరం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం, నిరాశ్రయల కేంద్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, ఔరంగబాషా, వెంకటేశ్వర్లురాజు, జనార్దన రెడ్డి, రమణయ్య, సురేంద్ర, కృష్ణయ్య, రత్నయ్య, నారాయణగౌడ్, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే విజయశ్రీ ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నేతలు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, దార్ల రాజేంద్ర, బాబు, జి.సుధీర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, నెలవల రాజేష్, పార్థసారధి, కిషోర్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

తడ: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను వాటంబేడు కుప్పంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మన శ్రీధర్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ మత్స్యకార నాయకులు సుధాకర్, జయపాల్, బొమ్మన ఏకాంబరం, తదితరులు పాల్గొన్నారు.


సీఎం ప్రమాణ స్వీకార ప్రత్యక్ష వీక్షణకు ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు రేపటి ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ ప్రత్యక్ష వీక్షణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ కార్యాలయాల్లో, కమ్యూనిటీ హాళ్లలో, నియోజకవర్గాల్లోని కమ్యూనిటీ హాళ్లలోకల్యాణ మండపాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేలా టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతిలో తుడా కార్యాలయం వెనుక వున్న కచ్చపి ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు జిల్లాలో ప్రతి నియోజకవర్గం నుంచి నాలుగు బస్సుల్లో ప్రజలను విజయవాడకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి బస్సుకూ ఒక నోడల్ అధికారి బాధ్యత తీసుకుని మంగళవారం ఉదయం ప్రజలను తీసుకుని బయల్దేరాల్సి వుంటుందన్నారు. సాయంత్రం 5గంటలకు విజయవాడకు చేరుకునే ప్రజలకు రాత్రి బస ఏర్పాటు చేస్తారని తెలిపారు. బుధవారం ఉదయం సీఎం ప్రమాణస్వీకారం పూర్తయ్యాక వారిని జాగ్రత్తగా వెనక్కి తీసుకురావాల్సిఉంటుందన్నారు.బుధవారం వరకూ ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటుతో పండుగ వాతావరణం కన్పించాలని తెలిపారు.

20నుంచి హనుమ నాటకోత్సవాలు

తిరుపతి అర్బన్, జూన్ 10: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో ఈనెల 20నుంచి హనుమ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపకులు బి.ఎన్.రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. 20నుంచి 28వ తేదీ వరకు జాతీయస్థాయి పద్యనాటకాలు, సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సోలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి తెలుగు రాష్ట్రాల నుంచి 32 పద్య, 57 సాంఘిక నాటికల దరఖాస్తులు అందాయన్నారు. పరిశీలన అనంతరం 9 పద్య, 12 సాంఘిక నాటికల దరఖాస్తులను ఎంపిక చేశామన్నారు. ప్రతిభకనబరిచిన ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, రోలింగ్ షీల్డ్స్, హనుమ అవార్డ్స్ జ్ఞాపికలు అందజేస్తామన్నారు. అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాధరెడ్డి, విజయ్‌కుమార్, శోభ, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన 21వేల పాఠ్యపుస్తకాలు



కోట, జూన్ 10: పట్టణంలోని ఎమ్మార్సీకి సోమవారం 21 వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. 8, 9, 10 తరగతులకు పంపిణీ చేస్తామన్నారు. అదే విధంగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 5,420 యూనిఫాం జతలు వచ్చినట్లు తెలిపారు. 1 నుంచి 7వ తరగతి వరకు 11 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. అదే విధంగా 40వేల నోటు పుస్తకాలు చేరాయన్నారు.

దేశ చరిత్రలో నూతన అధ్యాయనం



వెంకటగిరిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వెంకటగిరి టౌన్, జూన్ 10: 75ఏళ్ల దేశ చరిత్రలోనే బీజేపీ నూతన అధ్యాయానికి నాంది పలికిందని వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ మాజీ ఇన్‌ఛార్జి టీటీ మణి అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని స్థానిక క్రాస్ రోడ్డులో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్లల్లో మోదీ చేసిన సంక్షేమ పథకాలే ఆయనకు శ్రీరామరక్షగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో రవి, షణ్ముక, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని మండలంలోని పోటుపాళెంలో సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు గాలి ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ... కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాయన్నారు. రాష్ట్రాభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. మధు, బాషా, నరేష్, సంపత్, సుధాకర్, సుమన్, కోటేశ్వరరావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులతో వైసీపీ నేతల భేటీ



నాయుడుపేట, జూన్ 10: వైసీపీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, నాయుడుపేట జడ్పీటీసీ కట్టా జ్యోతి దంపతులు సోమవారం ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను కూడా మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఇలా వీరు టీడీపీ ఎమ్మెల్యేలను కలుస్తుండటంతో తెలుగుదేశం వైపు మొగ్గుచూపుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడికి సన్మానం

నాయుడుపేట, జూన్ 10: టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారాంను ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినుకొండ ధనంజయ ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కుప్పం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారానికి వెళ్తున్న ఆయన్ను మార్గమధ్యంలో నాయుడుపేటలో సోమవారం సమితి నా యకులు సన్మానించారు. ఆనంద్, కుమార్, మునికృష్ణ, శివ, శ్రీను, నరేష్, ప్రతాప్, బాలాజీ, సాయి, మస్తాన్ తదితరులున్నారు.

కిలో టమోటా రూ.60



గూడూరు, జూన్ 10: గూడూరులో సోమవారం కిలో టమోటా రూ.60 పలికాయి. గూడూరు కూరగాయల మార్కెట్‌కు కలికిరి, మదనపల్లె, కోల్‌కాతాల నుంచి టమోటాలు దిగుమతి అవుతుంటాయి. గత వారం కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండగా, సోమవారం ఉన్నట్టుండి కిలో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయించారు. దిగుబడులు తగ్గడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పెరిగిన టమోటాల ధరలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

ఊట గుంటలతో భూగర్భ జలాలు

బాలాయపల్లి, జూన్ 10: ఊట గుంటలు తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకోవచ్చుని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. సోమవారం బాలాయపల్లి పంచాయతీలోని చుట్టి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని ఊటగుంటల్లో ఉండే విధంగా చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ముత్యంజయరాం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



కొత్తగా ఎంపికైన కమిటీ

గూడూరు, జూన్ 10: వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఏపీహంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏపీ హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్)గూడూరు తాలూకా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గూడూరు తాలూకా అధ్యక్షురాలిగా రేవతి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా హజరత్తయ్య, కార్యదర్శిగా ముజీబ్, ట్రెజరర్‌గా విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రవీణతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రాజయ్య, కమల్‌కిరణ్, డాక్టర్ షరీనా, డాక్టర్ రవికుమార్, గౌరీ, శకుంతల, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గూడూరు, జూన్ 10: పట్టణంలోని రాజావీధిలో కొలువై ఉన్న గంగమ్మ ఆలయంలో సోమవారం వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అమ్మవారిని పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణంలో మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 10: స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రామ్మోహన్‌రావు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ.. సమాజంలో మూఢ నమ్మకాలు, సైన్స్ పట్ల అవగాహన కల్పించడమేకాకుండా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా పౌష్టికాహాన్ని పంపిణీ చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, రామ్మోహన్‌రావు, సుబ్బారావు, నాగరాజు, రాధయ్య, ప్రభాకర్, శ్రీనివాసులు, ఆనంద్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

బోర్ల మరమ్మతులకు చర్యలు

గూడూరు అర్బన్, జూన్ 10: పట్టణంలోని గాంధీనగర్‌లో నీటిసమస్య తలెత్తడంతో స్థానికులు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో వెళ్లి సోమవారం గాంధీనగర్‌లో మరమ్మతులకు గురైన బోర్లు, పైప్‌లైన్లను పరిశీలించారు. గాంధీనగర్, ప్రశాంతినగర్‌లలో పైప్‌లైన్లకు, బోర్లకు మరమ్మతులు సోమవారం నుంచే చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సురేంద్ర, ఉదయ్‌కుమార్, రమేష్‌రెడ్డి, శ్యామ్‌బాబు, వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కు అభినందనలు



గూడూరు, జూన్ 10: నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు, వివిధ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే నివాసంలో సోమవారం పాశిం సునీల్‌కుమార్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల్లో తనను గెలిపించినందుకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎన్నికల ప్రచారంలో గూడూరులో రోడ్ షోలో పాల్గొని తన విజయానికి సహకరించిన నందమూరి బాలకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీకి చర్యలు

వాకాడు, జూన్ 10: మండలంలో ఆయా గ్రామాల్లో స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎం హేమంత్‌కుమార్ చేప్పారు. మండలంలో రూ.31 లక్షలు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందన్నారు. నెల రోజుల్లోగా రుణాలను చెల్లించేలా సీసీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో రుణాలను సీఆర్పీలు పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు స్త్రీనిధి మేనేజర్ జయకుమార్, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

గూడూరు అర్బన్, జూన్ 10: సైదాపురం మండలం మర్లపూడిలోని జిల్లా ఉన్నత పాఠశాలకు ప్రగతి సేవా ఆధ్వర్యంలో బీరువాను వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, జి.చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళి, రమేష్, లక్ష్మీదేవి, రాము, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా


ఎంజేఆర్ కళాశాల చైర్మన్ అవినాశ్ రెడ్డి

పీలేరు, జూన్ 10: అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా సౌజన్యంతో రెండు రోజులపాటు జరగనున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని ఆయన వివరించారు. జాబ్‌మేళాలో టెక్ మహీంద్రా, ట్రెండ్జ్ ఇన్ఫర్మేషన్స్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రోబోట్-ఈడీ, సౌథర్లాండ్, టీం లీజ్, ఈఓఎస్ గ్లోబ్, క్యూస్ కార్ప్, అపోలో, ఫ్యూషన్ సి ఎక్స్ యంగ్ మైండ్స్, గ్రీన్ బ్లిస్, కాలిబర్ హెచ్ఆర్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో 30కిపైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలైన టీసీఎస్, ఆక్సెంచర్, డెల్టా ఎక్స్, ఆలోహ టెక్నాలజీస్, సూర్య టెక్ ప్రాంగణ ఎంపికలు చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగిగా అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 10: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామి వారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూధి, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు వైసీపీ నేతలకు నోటీసులు

శ్రీకాళహస్తి, జూన్ 10: ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు భారీగా చీరలు నిల్వ చేసిన ముగ్గురు వైసీపీ నేతలకు సోమవారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెంచులక్ష్మి కాలనీ వద్ద చీరలు నిల్వ చేసినట్లు గత నెల 5వ తేదీన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు, పోలీసులు గోదాముపై దాడి చేసి అదే రోజు 2,360 చీరలను సీజ్ చేశారు. ముక్కంటి ఆలయ పాలక మండలి సభ్యుడు జయశ్యామ్, మాజీ సభ్యుడు మున్నా రాయల్, వైసీపీ నాయకుడు సలీమ్‌పై కేసు నమోదు చేశారు. వీరిని సీఐ రారాజు సోమవారం స్టేషన్‌కు పిలిపించి 41ఏ నోటీసులు జారీ చేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

ఏర్పేడు, జూన్ 10: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ప్రగతి స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ శిరీష అన్నారు. సోమవారం మండలంలోని చిందేపల్లి, కుమ్మరిమిట్ట, అంజిమేడు, శివగిరికాలనీ, చెల్లూరు, గోవిందవరం గ్రామాల్లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. చిన్నారులకు చిత్రలేఖనం, నాటికలు వేయించారు. పాటలు పాడించారు. కార్యక్రమంలో వెంకటేష్, రాజేశ్వరి, సురేష్, సుమలత, అంగన్‌వాడీ టీచర్ భారతి పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డి విజయంపై సంబరాలు


కేక్ కట్ చేస్తున్న సుప్రజ తదితరులు

శ్రీకాళహస్తి, జూన్ 10: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో పట్టణంలోని 9వ వార్డు సచివాలయంలో సంబరాలు చేసుకున్నారు. మాజీ కౌన్సిలర్ సుప్రజ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తస్లీం, సుజాత, సురేఖ, మునీంద్ర, బాలాజీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జూన్ 10: కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌కే సింగ్ బగేల్‌ను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరు వార్తలు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


పరశురాం (ఫైల్‌ఫొటో)

వడమాలపేట, జూన్ 10: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వడమాలపేట మండలంలోని సోమవారం జరిగింది. మండలంలోని తిరుమణ్యం గ్రామానికి చెందిన పరశురాం(43) భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. అందులో నష్టాలు రావడంతో గొర్రెల పెంపకం చేపట్టాడు. ఈ క్రమంలో సుమారు 15 లక్షల మేరకు అప్పులు చేశాడు. ఇటీవల గొర్రెలు వ్యాధి బారిన మృతి చెందాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

భానుప్రకాష్ గెలుపుపై ఎన్నారైల హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ఎన్ఆర్ఐలు

పుత్తూరు అర్బన్, జూన్ 9: నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ గెలుపుపై టీడీపీ ఎన్ఆర్ఐలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం అమెరికాలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరి నుంచి 45 వేల ఓట్ల మెజార్టీతో గాలి భానుప్రకాష్ ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించడం హర్షణీయమన్నారు. భానుప్రకాష్ నేతృత్వంలో నగరి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరి నవీన్, కొకటం సురేష్‌రెడ్డి, నితిన్, వెంకి, వంశీ, సాయి, తాతినేని మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల యూనియన్ ఎంపిక

పుత్తూరు టౌన్, జూన్ 10: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో లారీ డ్రైవర్ యూనియన్ నూతన కమిటీని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా ప్రశాంత్, ఉపాధ్యక్షులు వేలు, రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా మనోహర్, మోహన్‌బాబు, కోశాధికారిగా శివశంకర్ వరప్రసాద్, కమిటీ సభ్యులు, సూర్య, అశోక్, సురేష్ ఎంపికయ్యారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

నేడు బంగారమ్మ జాతర

శ్రీకాళహస్తి, జూన్ 10: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని పిచ్చాటూరు రోడ్డులో వెలసిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర జరగనుంది. ఉదయం 6గంటలకు అభిషేకం, 7గంటలకు గరిగె పూజ, అంబళ్లు, 10గంటలకు ఫైలు ముగ్గు, మధ్యాహ్నం 2గంటలకు పోతురాజు ముగ్గు, సాయంత్రం 4గంటలకు భక్తులు పొంగళ్లు పెడుతారు. 12వ తేదీ బుధవారం ఉదయం 6గంటలకు అభిషేకం, అలంకారం, అమ్మవారి ముగ్గు, సాయంత్రం 4గంలకు కుంభం, 6గంటలకు బంగారమ్మ అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం జరుగుతుంది. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఎస్వీ నాగేశ్వరరావు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్లు, భక్తులకు వసతులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

వైసీపీ కార్యకర్తపై కేసు నమోదు

శ్రీకాళహస్తి, జూన్ 10: వైసీపీ కార్యకర్త నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రారాజు తెలిపారు. ఈనెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. అదేరోజు సాయంత్రం దక్షిణకైలాస్ నగర్ కాలనీలో టీడీపీ నాయకుడు ప్రసాద్‌నాయుడు, వైసీపీ కార్యకర్త నాగరాజు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో నాగరాజు తనపై చేయి చేసుకున్నట్లు ప్రసాద్‌నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఏర్పేడు సర్పంచ్‌పై విచారణ చేయండి

సోషల్ మీడియాలో వీడియా వైరల్

ఏర్పేడు, జూన్ 10: ఏర్పేడు సర్పంచ్ నల్లపాళెం శివయ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఆయనపై విచారణ చేయాలని సోషల్ మీడియాలో సోమవారం ఓ వీడియో వైరల్ అయింది. గత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని వీడియోలో వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో అయినా ఆయనపై విచారణ చేయించాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయానికి విద్యుత్ శోభ


విద్యుత్ వెలుగుల్లో ఆర్డీవో కార్యాలయం

శ్రీకాళహస్తి, జూన్ 10: శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి విద్యుత్ శోభ సంతరించుకుంది. మరో రెండురోజుల్లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అలంకరణ చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తన కార్యాలయాన్ని విద్యుత్ అలంకరణతో సుందరంగా ముస్తాబు చేశారు.

సీఎస్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న బాబు

నారాయణవనం, జూన్ 10: మండల పరిధిలోకి కీళగరం పంచాయతీలో ఉపాధి కూలీలకు వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ స్కీమ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కౌన్సిలర్ బాబు మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ పొదుపు ఖాతా ఉండాలని, సంపాదించే డబ్బులను కొంతవరకు పొదుపు చేసుకోవాలని సూచించారు. అలాగే సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన పథకాల గురించి వివరించారు.

సజ్జ సాగుపై రైతులకు శిక్షణ

కేవీబీపురం, జూన్ 10: మండలంలోని కొత్తూరు గ్రామంలో సజ్జసాగుపై రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రైతులకు శిక్షణ ఇచ్చారు. 04 సజ్జ రకం 90 నుంచి 95రోజుల పంట కాలం కలిగి ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందని చెప్పారు. పురుగుల మందుల వినియోగం, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మురళీకృష్ణ, శాస్త్రవేత్త రామ్‌కుమార్, సర్పంచు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సత్వరమే పారిశుధ్య పనులు

శ్రీకాళహస్తి, జూన్ 10: శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్య పనులు సత్వరమేగా చేపడుతున్నారు. సోమవారం ఉదయం నెహ్రూవీధిలోని డ్రైనేజీ కాలువలో తాగునీరు కలుషితం అవుతోందని ప్రజలు కమిషనర్ రమేష్‌బాబుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. బండలను ఎత్తి వ్యర్థాలను తొలగించారు. దీంతో మురుగునీరు నిల్వ చేరకుండా సాగింది. స్థానికులు పురపాలక సంఘ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

రేణిగుంట, జూన్ 10: రేణిగుంట మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి ఆయా కార్యదర్శులకు సూచించారు. సోమవారం రేణిగుంట పంచాయతీ పరిధిలోని సీబీఐడీ కాలనీ, బుగ్గవీధి, వినాయకనగర్ ప్రాంతాల్లో పంచాయతీ కార్మికులు మురుగు కాల్వలను శుభ్రం చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సూచనల మేరకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో తెలిపారు.

పంచాయతీ పీడబ్ల్యూఎస్ పనుల్లో స్వాహా

- రూ.26లక్షల మేర దుర్వినియోగమైనట్లు అనుమానాలు
- పంచాయతీ రికార్డుల్లో నమోదు కాని పనుల వివరాలు



రేణిగుంట పంచాయతీ కార్యాలయం

రేణిగుంట, జూన్ 10: రేణిగుంట పంచాయతీలో రూ.26 లక్షల మేర స్కాం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి అప్పటి స్పెషల్ ఆఫీసర్ ఈవోపీఆర్డీ నీలకంఠేశ్వరరెడ్డి, పంచాయతీ ఈవో బసిరెడ్డి హయాంలో పీడబ్ల్యూఎస్ పనులకు ఏప్రిల్‌లో టెండర్లు పిలిచారు. తక్కువ కోట్ చేసి వ్యక్తికి టెండర్లు కేటాయించారు. అదే సమయంలో పంచాయతీ ఈవో బసిరెడ్డి సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి కార్యదర్శిగా రమేష్ నియమితులయ్యారు. అదే ఏడాది జూన్‌లో ఈ పనులకు రూ.26 లక్షలు మంజూరు చేశారు. టెండర్లు పిలిచినట్లు, బిల్లు చెల్లించినట్లు పంచాయతీ కార్యాలయ రికార్డులో నమోదైంది. అయితే పరికరాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్, ఏ ప్రాంతంలో పనులు నిర్వహించారో, ఏ వస్తువులు ఎక్కడ వాడారు లాంటి వివరాల రికార్డు లేదు. స్టాక్ రిజిస్టర్, రికార్డు లేకుండా బిల్లులు ఎలా చెల్లించారోనని అనుమానం కలుగుతోంది. 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. అదే సమయంలో స్పెషల్ ఆఫీసర్ పాలనలో ఈ స్కాం జరిగినట్లు ఆరోపణలున్నాయి. 2021లో పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన రూ.27 లక్షలు దుర్వినియోగం చేసిన ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ సొమ్ము రికవరీ కాలేదని సమాచారం. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అప్పట్లో విధులు నిర్వహించిన అధికారులు ఒకే వర్గానికి చెందినవారు కావడంతో విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులు బయటకు రాకుండా తొక్కిపట్టారని విమర్శలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రూ.లక్షల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో గతంలో దుర్వినియోగం చేసిన మొత్తాన్ని కూడా రికవరీ చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎంపీడీవో విష్ణుచిరంజీవిని వివరణ కోరగా ఇప్పటివరకు ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారణ చేపట్టి వాస్తవముంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న రెడ్డివారి గురవారెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 10: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను సోమవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అంబిళ్లస్వామి వద్ద బాలకృష్ణ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బయ్య, నాగేశ్వరరావు, రాఘవులు యాదవ్, మునెయ్య, తేజ, బాలయ్య, యువరాజురెడ్డి, సోమశేఖర్‌యాదవ్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలో పల్లంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రమణ, నాగేశ్వరరావు, రాఘవులు యాదవ్, తేజారెడ్డి, సోమశేఖర్ యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో కేక్‌ను కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, రమేష్ నాయుడు, కన్నయ్యనాయుడు, సముద్రాల సుధాకర్‌నాయుడు, శ్రీనివాసులు, శశియాదవ్, భాస్కర్ యాదవ్, రమేష్‌బాబు, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావును యువత ఆదర్శంగా తీసుకోవాలి


రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అశోకరాజు

నారాయణవనం, జూన్ 10: రామోజీరావును యువత ఆదర్శంగా తీసుకోవాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళశాల చైర్మన్ అశోకరాజు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోకరాజు మాట్లాడుతూ సమాజంలో జాగృతి కోసం, ప్రజా చైతన్యం కోసం పాటుబడిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్ రాజు, రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మైసూరు యూనివర్శిటీ బీవోఎస్‌గా రాజేంద్రుడు



శ్రీకాళహస్తి, జూన్ 10: కర్నాటకలోని మైసూరు యూనివర్శిటీ బోర్డు ఆఫ్ స్టడీస్ ఇన్ తెలుగు(బీవోఎస్)గా శ్రీకాళహస్తి ఎస్పీఏ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకుడు సంక్రాంతి రాజేంద్రుడుకి అవకాశం కల్పించారు. యూనివర్శిటీ చైర్మన్, డీన్ ఆచార్య రామనాదం నాయుడు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు పంపారు. రాజేంద్రుడు బీవోఎస్‌గా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. రాజేంద్రుడిని ఎస్పీఏ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు బాపనయ్య, పరంధామయ్య, సునీత, సాయి, వెంకటేశ్, రమేష్, రుద్రమదేవి, సుబాషిణి, మునెయ్య, సుధీర్ అభినందించారు.

మొక్కుల చెల్లింపు


తిరుమల శ్రీవారి ఆలయం వద్ద యుగంధర్‌రెడ్డి తదితరులు

వరదయ్యపాళెం, జూన్ 10: వరదయ్యపాళెం మండలం టీడీపీ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ గెలిచి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, అదే విధంగా సత్యవేడు ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం గెలవాలని మొక్కుకున్నారు. వారు విజయం సాధించడంతో యుగంధర్‌రెడ్డి తిరుమలకు పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆయన వెంట అభిరామ్, శంకర్, కోటి, సుధాకర్, లోకనాథరెడ్డి ఉన్నారు.

ముక్కంటి ఆలయంలో పూజలు


శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నేతలు

ఏర్పేడు, జూన్ 10: ఎన్డీఏ కూటమి విజయం సాధించినందుకు ఏర్పేడు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత బాలాజీరాయల్ మొక్కు తీర్చుకున్నాడు. సోమవారం కుటుంబసభ్యులతో కలిసి ఏర్పేడు నుంచి పాదయాత్రగా శ్రీకాళహస్తికి చేరుకుని ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి 2,001 టెంకాయలు కొట్టారు. పాదయాత్రలో టీడీపీ నాయకులు ఊటి చంద్రశేఖర్‌యాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, నల్లపాలెం సుబ్రహ్మణ్యం రెడ్డి, కుక్క రమణయ్య, జయకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



ఏర్పేడు, జూన్ 10: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం సాధించినందుకు తిరుపతిలోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో టీడీపీ నేతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అమర్‌నాథ్, నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

బాలాజీ మెడికల్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



కళాశాల ఎదుట నిరసన తెలుపుతన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రేణిగుంట, జూన్ 10: విద్యార్థులను వేధిస్తున్న శ్రీబాలాజీ మెడికల్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంఎల్టీ, బీపీటీ చదువుతున్న విద్యార్థులు వేసవి సెలవుల తరువాత తరగతులకు వస్తే ఆలస్యం, అటెండెన్స్ లేదంటూ పరీక్షలకు అనుమతించబోమని చెప్పడం అన్యాయమన్నారు. అంతేకాకుండా విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరించి రూ.5వేల నుంచి రూ.7,500 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు చెల్లించకుంటే కళాశాలకు రావద్దంటూ విద్యార్థులను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే హెల్త్ యూనివర్శిటీ, కలెక్టర్ స్పందించి మెడికల్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు సాయి, ఉదయ్, హరి, ఓంరాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై శ్రీబాలాజీ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ నాగరాజును వివరణ కోరగా విద్యార్థిసంఘం నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు.

శ్మశాన వాటికకు దారి చూపండి

రేణిగుంట, జూన్ 10: రేణిగుంట మండలం అత్తూరు పంచాయతీ పరిధిలోని మొలగమూడిలోని శ్మశానవాటికకు దారి చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. సోమవారం వారు మాట్లాడుతూ శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో పొలాల గట్లపై, వంకలో శవాలను తీసుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. 20 ఏళ్లగా ఇబ్బందులు పడుతన్నామని, పలుమార్లు ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశామని, స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో శ్మశాన వాటికకు 23 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉందని, కాలక్రమేణా ఆక్రమణకు గురవడంతో దారి లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు దారి చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి రాజీనామా

నారాయణవనం, జూన్ 10: మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం ఎంపీడీవో కృష్ణమూర్తికి తన రాజీనామా లేఖను అందజేశారు.